


PRGI NO: TGTEL/25/A5314

# అర్జున్ సమాచారం

www.arjunsamaachaaram.in

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : లింగం రాజయ్య

బ్యూరో చీఫ్ : గిరవెన రాకేష్




నల్లగొండ హైదరాబాద్ రంగారెడ్డి | epaper.arjun saamaacharam.com | శనివారం 04, జులై 2026 | సంపుటి :1 సంచిక : 183 | పేజీలు : 8 , వెల.2.00



## అమర్‌నాథ్ యాత్రికులకు ప్రధాని శుభాకాంక్షలు..

### 'ఐదు సంకల్పాలు' స్వీకరించాలని పిలుపు

జమ్మూ– కశ్మీర్‌లో నేటి (శుక్రవారం) నుంచి ప్రారంభమైన వార్షిక అమర్‌నాథ్ యాత్రను పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ భక్తులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర యాత్రను ఒక 'గొప్ప భాగ్యం'గా అభివర్ణించిన ప్రధాని, భక్తిశ్రద్ధలతో, క్రమశిక్షణతో, బాధ్యతాయుతమైన జాతీయ భావనతో భక్తులు ఈ ప్రయాణాన్ని కొనసాగించాలని కోరారు.

వార్త 2లో

## పాలమూరు పౌరుషమా? కల్వకుంట్ల

# పౌరుషమా చూసుకుందాం

తెలంగాణ అప్పులపై మంత్రి జూపల్లి కృష్ణారావు చర్చకు సిద్ధమయ్యారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో చర్చకు సిద్ధమని.. సాయంత్రం 5 గంటలకు వస్తానని బీఆర్ఎస్ నేతలకు మరోసారి సవాల్ విసిరారు. 'మీరు సిద్ధమైతే ముందే చెప్పండి. నా లెక్కలు తప్పు అయితే రాజీనామా చేస్తా. మీ లెక్కలు తప్పు అయితే రాజీనామా చేస్తారా? బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా? కేసీఆర్ రాకపోతే జూపల్లి చెప్తున్న లెక్కలు తప్పని మీడియాతో చెప్పమనండి. ఖబడ్దార్.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్.. పాలమూరు పౌరుషమా? కల్వకుంట్ల పౌరుషమా చూసుకుందాం' అంటూ ఛాలెంజ్ చేశారు.'నేనెక్కడికీ పారిపోలేదు. పారిపోయే లక్షణం నాకు లేదు. నా మాటకు కట్టుబడి ఉన్నాను. ఆపరేషన్ సక్సెస్, పేషెంట్ డెడ్‌లాగా కేటీఆర్, హరీశ్ వ్యవహరిస్తున్నారు.

వివరాలు 2లో..

'మీరు సిద్ధమైతే ముందే చెప్పండి

నా లెక్కలు తప్పు అయితే రాజీనామా చేస్తా

మీ లెక్కలు తప్పు అయితే రాజీనామా చేస్తారా?

ఖబడ్దార్.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్..

'నేనెక్కడికీ పారిపోలేదు.

పారిపోయే లక్షణం నాకు లేదు.

నా మాటకు కట్టుబడి ఉన్నాను.

మంత్రి జూపల్లి సవాల్






## మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పు..

### అలాంటి వాళ్లు హిందువులే..

మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. విదేశీ పేరు, పౌరసత్వం ఉన్నంత మాత్రాన హిందూ గుర్తింపును నిరాకరించలేమని తేల్చి చెప్పింది. హిందూ మతాన్ని స్వీకరించడానికి ఎలాంటి సర్టిఫికెట్లు, ప్రత్యేక వేడుకలు అవసరం లేదని మద్రాస్ హైకోర్టు అభిప్రాయపడింది.

## అప్పులతో తెలంగాణను

# సర్వనాశనం చేశారు..

### బీఆర్ఎస్‌పై భట్టి విక్రమార్క ఫైర్




2

మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సవాల్ విసిరారు. బీఆర్ఎస్ పాలనలో అప్పులపై కేసీఆర్ స్పందించాలన్నారు. ఈరోజు(శుక్రవారం) భట్టి మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో మొత్తం అప్పు రూ.8.21 లక్షల కోట్లు అని.. మొత్తం అప్పుల్లో గత ప్రభుత్వ బకాయిలు ఉన్నాయని తెలిపారు. అప్పులు అన్నీ వాస్తవాలు కాదా.. వీటిని ఎవరు చెల్లిస్తారని ప్రశ్నించారు. అప్పులపై కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.అప్పులను తక్కువ చేసి చూపేందుకే కేటీఆర్, హరీశ ప్రయత్నిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి మండిపడ్డారు.

## మంత్రులు గోల్ కొడతామని.. సెల్ఫ్


# గోల్ అయ్యారు: హరీశ్ రావు

తెలంగాణ అప్పులకు సంబంధించి మంత్రి జూపల్లి కృష్ణారావు రాసిన లేఖపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. రాష్ట్ర అప్పులపై మంత్రి జూపల్లి పంపిన వాట్సాప్ లేఖ అందిందని తెలిపారు. అప్పులపై మంత్రి, ముఖ్యమంత్రి మాటలు విరుద్ధంగా ఉన్నాయన్నారు. అప్పులపై అసెంబ్లీలో తాను మాట్లాడిన వీడియో, ముఖ్యమంత్రి మాట్లాడిన వీడియో జూపల్లికి పంపినట్లు చెప్పారు. మంత్రి లెక్క ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం అప్పు రూ.1.77 లక్షల కోట్లు అని.. =దీ× లెక్కల ప్రకారం రూ.1.86 లక్షల కోట్లు అని తెలిపారు.



2

2




## ఇరాన్ అగ్రనేతలను కాపాడిన అమెరికా..

### సంచలన విషయాలు వెలుగులోకి!

పశ్చిమాసియా సంక్షోభంలో సరికొత్త అంతర్జాతీయ రహస్యాలు వెలుగులోకి వచ్చాయి. ఇవి.. అమెరికా, ఇజ్రాయెల్ మైత్రి బీటలు వారిందని చెప్పేందుకు మరింత ఊతమిచ్చేలా ఉన్నాయి. ఇరాన్ అగ్రనేతలు, శాంతి చర్చల ప్రతినిధులైన విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ, పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బాఘేర్ గాలిబాఫ్ లపై ఇజ్రాయెల్ వేసిన 'హత్య ప్రణాళిక' ను అమెరికా ముందే పసిగట్టి, ఇరాన్‌ను అప్రమత్తం చేయడం ద్వారా వారి ప్రాణాలను కాపాడినట్లు వెల్లడించింది.

2



## గుజరాత్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్ ఏర్పాటుకు కుట్ర.. 8 మంది అరెస్ట్..

గుజరాత్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్ ఏర్పాటు కోసం ఉగ్రవాద సంస్థ జైష్-ఎ-మహ్మద్ చేసిన కుట్ర వెలుగులోకి వచ్చింది. గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్.. గుజరాత్, మధ్యప్రదేశ్‌లో 8 మందిని అరెస్ట్ చేసింది.

## బిఆర్ఎస్, బిజెపి ఒక్కటేనని

# అందరికీ తెలుసు: మహేష్ గౌడ్


హైదరాబాద్:

వాస్తవాలు చెప్తుంటే బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తప్పుదోవ పట్టిస్తున్నారని టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. మాజీ సిఎం కెసిఆర్ ప్రభుత్వ అప్పులు లెక్కలతో సహా చెప్పామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని వాళ్లని గద్దె దింపారని,



కాళేశ్వరం పేరిట రూ.1.20 లక్షల కోట్లు బూడిదలో పోశారని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. బిఆర్ఎస్, బిజెపి ఒక్కటేనని అందరికీ తెలుసు అని బిజెపి పాలనలో అదానీ, అంబానీ మాత్రమే అభివృద్ధి చెందారని తెలియజేశారు. దేవుని పేరు చెప్పి మోసం చేస్తే..రాష్ట్ర ప్రజలు నమ్మే స్థితిలో లేరని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు.

2 లో..



## పాకిస్తాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. 40 మంది మృతి

## జన్మతః పిల్లల పౌరసత్వం కేసు

### సుప్రీం తీర్పుతో ఊరట చెందిన ఎన్నారైలు

న్యూయార్క్,

విదేశీ వలసదారుల పిల్లల పౌరసత్వాన్ని పరిరక్షిస్తూ అమెరికా సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుపై భారతీయ అమెరికన్ల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. విదేశీయుల పిల్లలకు పౌరసత్వం నిరాకరించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారం కొట్టివేసిన విషయం తెలిసిందే. అక్రమ వలసదారులు, తాత్కాలిక వీసాలు కలిగిన వారి పిల్లలు అమెరికాలో జన్మిస్తే.. వారిని అమెరికన్లుగానే పరిగణించాలని కోర్టు తీర్పునిచ్చింది. దీనిపై ఇండో అమెరికన్లు హర్షం చేస్తున్నారు. ఈ తీర్పు అమెరికాలోని వలస కుటుంబాలకు గొప్ప భరోసా కల్పించిందంటున్నారు. ట్రంప్ జారీచేసిన కార్యనిర్వాహక ఉత్తర్వుల్లో ప్రత్యక్షంగా ప్రభావితం అయ్యేది భారత్, దక్షిణాసియా వలస కుటుంబాలేనన్నారు. అమెరికా సుప్రీంకోర్టు వెలువరించిన ఈ తీర్పు 'చరిత్రాత్మక విజయం' అని పలువురు ఎన్నారైలు అభివర్ణించారు. దాదాపు 52 లక్షల మంది ఇండో అమెరికన్లలో 12 లక్షల మందికి పైగా ఉద్యోగ ఆధారిత గ్రీన్‌కార్డు కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారని ఎఫ్ఐఐడీఎస్ అధ్యక్షుడు ఖండేరావ్ కంద్ తెలిపారు. అమెరికాలో ప్రస్తుతం 6 నుంచి 7 లక్షల మంది హెచ్1బీ వీసాదారులు ఉన్నట్లు తాజా అంచనాలు పేర్కొంటున్నాయి. వారిలో 70 శాతానికి పైగా భారతీయులే ఉన్నారు. సుప్రీంకోర్టు తీర్పుతో హెచ్1బీ వీసాదారులకు ఊరట లభించనుంది.

## అగ్రరాజ్యంలో చీకటి కోణం

### రహస్యంగా 16మంది చిన్నారుల నిర్బంధం

### ఓ కేసు కోసం వెళ్లిన పోలీసులకు కనపడ్డ దృశ్యం

న్యూయార్క్,

అగ్రరాజ్యం అమెరికాలోని ఒహాయో రాష్ట్రంలో వెలుగులోకి వచ్చిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. 16 మంది చిన్నారులను ఏళ్ల తరబడి ఓ పాడుబడిన ఇంట్లో బంధించి ఉంచిన విషయం తాజాగా బయటపడింది. మరో కేసు దర్యాప్తు నిమిత్తం పోలీసులు ఆ ఇంటికి వెళ్లగా అక్కడ కనిపించిన దృశ్యాలు వారిని దిగ్భ్రాం÷–రతికి గురి చేశాయి. అత్యంత దయనీయ పరిస్థితుల్లో ఉన్న చిన్నారులను వెంటనే రక్షించిన పోలీసులు, వారిని బంధించిన నలుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఒహాయో రాష్ట్రంలోని హామ్డెన్‌లో రైల్వే ట్రాక్ పక్కన దట్టమైన చెట్లు, పొదల మధ్య ఉన్న ఓ ఇంటికి పోలీసులు సెర్చ్ వారెంట్‌తో వెళ్లారు. అక్కడ 16 మంది చిన్నారులను వారి తల్లిదండ్రులు, తాతా అమ్మమ్మలు బంధించి ఉంచినట్లు గుర్తించారు. గత నాలుగేళ్లుగా వారు అమానవీయ పరిస్థితుల్లో జీవిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. బాధిత చిన్నారులను 12 అడుగుల పొడవు, 12 అడుగుల వెడల్పు గల ఒకే గదిలో ఉంచినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. చిన్నారుల వయస్సు 18 నెలల నుంచి 18 సంవత్సరాల మధ్య ఉండగా, వారిలో బాలురు, బాలికలు ఉన్నారు. అంతేకాక, ఆ ఇంట్లో ఇంతమంది చిన్నారులు ఉన్న విషయం చుట్టుపక్కల వారికి కూడా తెలియకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. చిన్నారులకు బయటి ప్రపంచంతో దాదాపు ఎలాంటి సంబంధం లేకుండా ఉంచినట్లు అధికారులు గుర్తించారు. వారిలో ఎవరినీ ఇప్పటివరకు తల్లిదండ్రులు పాఠశాలకు పంపలేదు. చాలా కాలం పాటు బంధించబడటంతో వారు సాధారణంగా మాట్లాడటానికే ఇబ్బంది పడుతున్నట్లు ఒహాయో అటార్నీ జనరల్ తెలిపారు. దాదాపు అందరూ అడవి మనుషుల్లా కనిపించారని ఆయన పేర్కొన్నారు. ఈ 16 మంది చిన్నారులూ ఒకే కుటుంబానికి చెందినవారని అధికారులు వెల్లడించారు. రక్షించిన వెంటనే ఏడుగురు చిన్నారులను చికిత్స కోసం కొలంబస్‌లోని ఆస్పత్రికి తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో హెలికాప్టర్‌లో అత్యవసర చికిత్స కోసం తరలించాల్సి వచ్చింది. ఘటనలో పిల్లల తల్లిదండ్రులు, తాతా అమ్మమ్మలైన గ్యారీ సైడర్స్ జూనియర్, గ్యారీ సైడర్స్ సీనియర్, క్రిస్టినా సైడర్స్, ఎలిజబెత్ సైడర్స్‌లపై సెకండ్–డిగ్రీ ఫెలనీ 'చైల్డ్ ఎండేంజర్‌మెంట్' అభియోగాలు నమోదు చేశారు. అనంతరం వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. మరోవైపు ప్రతి నిందితుడికి 3 లక్షల డాలర్ల పూచీకత్తుతో బెయిల్ మంజూరు చేయాలని కోర్టు నిర్ణయించింది.

## శ్రీవారిని దర్శించుకున్న మంత్రి లోకేశ్

### బ్రహ్మం చౌదరి, గౌతమిల నిశ్చితార్థానికి హాజరు

తిరుమల,

ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామివారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, ఆంధ్రప్రదేశ్ మరింత అభివృద్ధి సాధించాలని స్వామివారిని ప్రార్థించినట్లు మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. అనంతరం తిరుపతిలోని భూపాల్ హౌసింగ్ కాలనీలో తెలుగుదేశం పార్టీ సోషల్ మీడియా యాక్టివిస్ట్ కే. గౌతమి శ్వేత నివాసాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏపీ కమ్మ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి, కే. గౌతమి శ్వేతలను మంత్రి లోకేశ్ ఆశీర్వదించారు. వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్న ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతూ వారి ఉజ్వల భవిష్యత్తును ఆకాంక్షించారు. మంత్రి నారా లోకేశ్ సమక్షంలో నాదెండ్ల బ్రహ్మం చౌదరి, గౌతమి శ్వేతలు ఉంగరాలు మార్చుకుని నిశ్చితార్థ వేడుకను నిర్వహించారు. మంత్రి లోకేశ్ ఈ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివాహానికి ముందు జరిగిన ఈ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది. పలువురు టీడీపీ నేతలు, పార్టీ కార్యకర్తలు కూడా హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన దంపతుల జీవితంలో ఈ శుభ ఘట్టం చిరస్మరణీయంగా నిలవాలని మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు. రాత్రి తిరుమలలోని శృంగేరీ శారద పీఠంలో నాదెండ్ల బ్రహ్మం చౌదరి, గౌతమి శ్వేతల వివాహం జరగనుంది. ఈ వివాహ వేడుకకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నారు.

## ఎపి భవిష్యత్‌ను నాశనం చేయడమే జగన్ లక్ష్యం

### అప్పుడు మూడు రాజధానులు...ఇప్పుడు మావిగన్

### మతితప్పి మాట్లాడుతున్న జగన్: సోమిరెడ్డి ఆగ్రహం

అమరావతి, ఏపీ భవిష్యత్తు నాశనం కావాలని జగన్ కంటకణం కట్టుకున్నారని, అందుకే మావిగన్ అంటున్నారంటూ టిడిపి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్‌కు మానవత్వం లేదన్నారు. ఇది విజనరీ, మెంటల్ కేసుకు మధ్య పోటీ అంటూ దుయ్యబట్టారు. మొదట 'అమరావతి' తర్వాత 'మూడు రాజధానులు' ఇప్పుడు 'మావిగన్' అంటూ జగన్ ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్ తీరు అందరికీ తెలుసన్నారు. అమరావతి, మావిగన్‌కు పోటీ అని వైసీపీ అధినేత అంటున్నారని మండిపడ్డారు. జగన్ ఏం చెబుతున్నారో ఆయనకే అర్థంకాని పరిస్థితి ఉందని ఎమ్మెల్యే అన్నారు. అమరావతిలో వేల కోట్ల పెట్టుబడులు వస్తుంటే... జగన్‌కు మాత్రం విధ్వంస రాజకీయాలే కనిపిస్తున్నాయని మండిపడ్డారు. లోక్‌సభలో అన్ని పార్టీలు అమరావతికి మద్దతు ఇస్తున్నామని చెబితే.. ఒక్క వైసీపీ నేతలు మాత్రం బాయ్‌కాట్ చేసి బయటకు వెళ్లారని విరుచుకుపడ్డారు. గత ఎన్నికల్లో 3 రాజధానులంటూ వెళ్తే 11 సీట్లు వచ్చాయని తెలిపారు. రేపు మావిగన్ పేరుతో వెళ్తే ఒకటో, రెండో సీట్లు వస్తాయన్నారు. జగన్‌కు ఏం కావాలో తెలియట్లేదని.. జేబులో గన్, చేతిలో గొడ్డలి కావాలేమో అంటూ వ్యాఖ్యానించారు. రైతుల త్యాగాలతో నిర్మితమైన రాజధానిపై కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నారని సోమిరెడ్డి ఆరోపించారు. గత ఐదేళ్లు అమరావతి నుంచే పాలన చేసిన జగన్ ఇప్పుడు అదే రాజధానిపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. రూ.57,821 కోట్ల అభివృద్ధి పనులు కొనసాగుతున్న అమరావతిని అడ్డుకోవడం రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధమన్నారు. కూటమి ప్రభుత్వం పెట్టుబడులు తెస్తుంటే... జగన్ పెట్టుబడిదారులను భయపెట్టే రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి రాష్ట్ర భవిష్యత్తు.. దాన్ని అడ్డుకునే రాజకీయాలకు ప్రజలే ఫుల్‌స్టాప్ పెడతారని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు.

# యూజర్‌నేమ్ ఫీచర్ ఇంకా అందుబాటులోకి తీసుకురాలేదు

### దశలవారీగా తీసుకొచ్చే ప్రయత్నంలో ఉన్నాం

### యూజర్ నేమ్ ఉన్నా ఫోన్ నంబర్ తప్పనిసరి

### కేంద్రం అభ్యంతరాలకు వాట్సాప్ సమాధానం




న్యూఢిల్లీ,

వాట్సాప్‌లో ప్రవేశపెట్టబోతున్న యూజర్‌నేమ్ ఫీచర్‌పై కేంద్ర ప్రభుత్వం వ్యక్తం చేసిన ఆందోళనల నేపథ్యంలో మెటా సంస్థకు చెందిన వాట్సాప్ కీలక వివరణ ఇచ్చింది. ప్రస్తుతం యూజర్‌నేమ్ ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకురాలేదని, వినియోగదారులు తమకు నచ్చిన యూజర్ నేమ్‌ను ముందస్తుగా రిజర్వ్ చేసుకునే అవకాశం మాత్రమే కల్పించామని స్పష్టం చేసింది. ఈ ఫీచర్‌ను ఈ ఏడాది చివర్లో దశలవారీగా అమలు చేస్తామని వెల్లడించింది. యూజర్‌నేమ్ ఫీచర్‌తో వినియోగదారులు తమ మొబైల్ నంబర్‌ను వెల్లడించకుండా కొత్త వ్యక్తులు, గ్రూపులతో కనెక్ట్ అయ్యే అవకాశం ఉంటుందని తెలిపింది. ఈ ఫీచర్‌తో గోప్యత, భద్రత, నకిలీ ఖాతాలు, మోసాలు వంటి అంశాలపై వస్తున్న సందేహాలకు ఎక్స్ వేదికగా వివరణ ఇచ్చింది. యూజర్‌నేమ్‌ను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సృష్టించాల్సిన అవసరం లేదని వాట్సాప్ తెలిపింది. ఇది పూర్తిగా వారి ఇష్టమని పేర్కొంది. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లో ఇప్పటికే ఉన్న యూజర్‌నేమ్‌లు ఆయా ఖాతాదారుల కోసం రిజర్వ్ చేయబడతాయని వాట్సాప్ తెలిపింది. అలాగే ప్రముఖులు, ప్రభుత్వ సంస్థలు, సెలబ్రిటీలు, మెటా వెరిఫైడ్ ఖాతాలకు సంబంధించిన పేర్లు, వాటి వేరియేషన్లు కూడా దుర్వినియోగానికి గురి కాకుండా రక్షిస్తామని పేర్కొంది. ఒకవేళ సాధారణ పేరు ఇప్పటికే మరొకరు తీసుకున్నట్లయితే, ప్రత్యామ్నాయ యూజర్‌నేమ్‌లను సూచించే జనరేటర్‌ను ఉపయోగించుకోవచ్చని తెలిపింది. తన యూజర్‌నేమ్‌కు దగ్గరగా మరో వ్యక్తి పేరు సృష్టించి మోసాలకు పాల్పడితే ఎలా అనే ప్రశ్నకు వాట్సాప్ స్పందించింది. యూజర్‌నేమ్‌లను సెర్చ్ చేసే అవకాశం ఉండదని స్పష్టం చేసింది. యూజర్‌నేమ్ ఆధారంగా సందేశాలు పంపే ఫీచర్ అందుబాటులోకి వచ్చిన తర్వాత, కొత్త వ్యక్తి నుంచి మెసేజ్ వస్తే అతని దేశం, ఖాతా వివరాలు, భద్రతా హెచ్చరికలు చూపిస్తామని తెలిపింది. ఇప్పటికే ఉన్న బ్లాక్, రిపోర్ట్ వంటి భద్రతా చర్యలు యథావిధిగా కొనసాగుతాయని పేర్కొంది. యూజర్‌నేమ్‌తో పాటు 'యూజర్‌నేమ్ కీ' అనే అదనపు భద్రతా వ్యవస్థను కూడా ప్రవేశపెడుతున్నట్లు వాట్సాప్ వెల్లడించింది. దీన్ని యాక్టివేట్ చేసుకుంటే, అవతలి వ్యక్తికి యూజర్‌నేమ్‌తో పాటు కీ కూడా తెలిసి ఉండాల్సి ఉంటుంది. అవసరమైతే ఈ కీని ఎప్పుడైనా మార్చుకునే అవకాశం ఉంటుందని తెలిపింది. ఫేస్‌బుక్ లేదా ఇన్‌స్టాగ్రామ్‌లో ఉన్న అదే యూజర్‌నేమ్‌ను వాట్సాప్‌లో కూడా ఉపయోగించాలనుకునే వారు ముందుగా ఆ ఖాతాలను లింక్ చేసి యాజమాన్యాన్ని నిర్ధారించుకోవాల్సి ఉంటుందని తెలిపింది. అనంతరం కావాలంటే ఆ ఖాతాలను అన్‌లింక్ చేసుకునే అవకాశం కూడా ఉంటుందని వెల్లడించింది. యూజర్‌నేమ్ ఫీచర్ అమలుతో నకిలీ గుర్తింపులు, డిజిటల్ అరెస్ట్ మోసాలు, ఆర్థిక మోసాలు పెరిగే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వ అధికారులు, ఆర్థిక సంస్థలు, ప్రజాప్రతినిధుల పేర్లతో పోలిన యూజర్‌నేమ్‌లను దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందని పేర్కొంటూ ప్రభుత్వంతో సంప్రదింపులు పూర్తయ్యే వరకు ఈ ఫీచర్‌ను అమలు చేయొద్దని వాట్సాప్‌ను ఆదేశించింది. అలాగే ఫీచర్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, భద్రతా చర్యలపై మూడు రోజుల్లో నివేదిక సమర్పించాలని నోటీసు జారీ చేసింది. దీనిపై స్పందించిన వాట్సాప్ ప్రతినిధి ప్రస్తుతం యూజర్‌నేమ్‌లను రిజర్వ్ చేసుకునే అవకాశం మాత్రమే కల్పించామని, యూజర్‌నేమ్ ఆధారంగా మెసేజింగ్ సేవ ఇంకా ప్రారంభం కాలేదని

స్పష్టం చేశారు. ప్రముఖులు, ప్రభుత్వ సంస్థలు, సెలబ్రిటీలు, మెటా వెర్గి÷డ్ ఖాతాలకు సంబంధించిన యూజర్‌నేమ్‌లను వారి అసలు యజమానుల కోసమే రిజర్వ్ చేసినట్లు తెలిపారు. అలాగే యూజర్‌నేమ్‌ను కచ్చితంగా తెలుసుకోవాల్సిన విధానం, యూజర్‌నేమ్ కీ, అనుమానాస్పద కార్యకలాపాల గుర్తింపు, మోసాల నివారణ వంటి పలు భద్రతా చర్యలను అమలు చేస్తున్నట్లు వివరించారు. వాట్సాప్‌ను ఉపయోగించడానికి మొబైల్ నంబర్ తప్పనిసరిగా కొనసాగుతుందని కూడా స్పష్టం చేశారు.

## మావిగన్ అంటే ఇక సున్నాకే పరిమితం

### జగన్‌ను హెచ్చరించిన మంత్రి గొట్టిపాటి



అమరావతి,

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రాజధానుల పేరుతో ఎన్నికలకు వెళ్తే వైసీపీకి 11 సీట్లు వచ్చాయని.. ఇప్పుడు మావిగన్ అనే పిచ్చిచేష్టలతో ఎన్నికలకు వెళ్తే సున్నాకే పరిమితం అవుతారంటూ వ్యాఖ్యానించారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో మంత్రి పాల్గొ?న్నారు. అనంతరం మాట్లాడుతూ.. జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేయాలనే లక్ష్యంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మూడు రాజధానుల పేరుతో ఒక్క ఇటుక కూడా పెట్టకుండా.. రూ.450 కోట్లు ఖర్చుపెట్టి తన కోసం ప్యాలెస్ నిర్మించుకున్నారని ఆరోపించారు. అమరావతి నిర్మాణ పనులు వేగవంతంగా జరుగు తున్నాయని చూసి ఓర్చుకోలేక జగన్ విషం కక్కారని మంత్రి వ్యాఖ్యానించారు. అమరావతిపై తనకు ఎటువంటి వ్యతిరేకతలేదని.. 33000 ఎకరాలు కావాలని చెప్పిన వ్యక్తి జగన్ అని గుర్తుచేశారు. అమరావతి లోనే ఇల్లు కట్టుకున్నానని ఆనాడు ప్రజల్ని నమ్మించారన్నారు. అందుకే ప్రజలు నీకు బుద్ధి చెప్పి 11 సీట్లకే పరిమితం చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు సాధించేందుకు సీఎం చంద్రబాబు అహర్నిశలూ కష్టపడుతున్నారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు.

## ఎన్టీపీసి సోలార్ విద్యుత్ ప్రాజెక్ట్ పూర్తి

### వాణిజ్య ఉత్పత్తిలోకి

### 176మెగావాట్ల సోలార్ విద్యుత్

కరీంనగర్,

రామగుండం ఎన్టీపీసీలోని బ్యాలెన్స్ రిజర్వాయర్‌లో 176మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్రాజెక్టు పూర్తిస్థాయి వాణిజ్య ఉత్పత్తి దశలోకి చేరుకుంది. తాజాగా మంగళవారం చివరి 41.6మెగావాట్ల యూనిట్ కమర్షియల్ ఆపరేషన్‌లోకి వచ్చింది. ఈ ప్రాజెక్టులో 56మెగా వాట్ల ఫ్లోటింగ్ సోలార్, 120మెగావాట్ల సర్ఫేస్‌సోలార్ ప్రాజెక్టును నిర్మించారు. ఎన్టీపీసీ రిజర్వాయర్‌లో ఇంతకుముందు 100మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టును నిర్మించారు. మూడేళ్లుగా ఈ ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యంతో పనిచేస్తుంది. ఈక్రమంలో ఈప్రాజెక్టు విస్తరణను ఎన్టీపీసీ యాజ మాన్యం చేపట్టింది. 176మెగావాట్ల కంబైన్డ్ సోలార్ ప్రాజెక్టుకు సంబంధించి తొలిదశ వంద మెగావాట్లు గత మే 2న, రెండో దశ 34.4 మెగావాట్లు మే29న వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించాయి. తాజాగా మిగిలిన 41.6 మెగావాట్లు మంగళవారం నుంచి అందు బాటులోకి వచ్చింది. దీంతో దేశవ్యాప్తంగా ఎన్టీపీసీ సంస్థ మొత్తం స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 90,899మెగావాట్లకు, వాణిజ్య విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 89,819 మెగావాట్లకు పెరిగింది. రామగుండం ఎన్టీపీసీ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో నెలకొ ల్పిన 156 మెగావాట్ల ఎ÷–లోటింగ్ సౌర విద్యుత్‌కేంద్రం దక్షిణాదిలోనే అతిపెద్దదిగా గుర్తింపు పొందింది.

## ఎల్‌నినోతో తక్కువ వర్షపాతం

### కేంద్రం తాజా అంచనాలు

న్యూఢిల్లీ

ఎల్ నినో ప్రభావం కారణంగా దేశంలో సాధారణం కంటే తక్కువగా వర్షాలు కురిసే 315 జిల్లాలను కేంద్ర వ్యవసాయ శాఖ గుర్తించింది. ఈ జిల్లాలు కలిగిన ఆయా రాష్ట్రాలు తమ అత్యవసర ప్రణాళికలను అమలు చేయాలని ఆదేశించింది. ఈ 315 జిల్లాల్లో 25 శాతం కంటే తక్కువ సాగునీటి వసతి కలిగిన 111 జిల్లాలను అత్యంత ప్రమాదకమైన కేటగిరీగా గుర్తించారు. 25 నుంచి 50 శాతంలోపు సాగునీటి వసతి ఉన్న మరో 76 జిల్లాలను మధ్యస్థ ప్రమాదకర



కేటగిరీలో చేర్చగా, 50 శాతం కంటే ఎక్కువ సాగునీటి సౌకర్యం ఉన్న 128 జిల్లాలను సాపేక్షంగా తక్కువ ముప్పు ఉన్న ప్రాంతాలుగా పరిగణించారు. అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్న జిల్లాలు ఎక్కువగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో కేంద్రీకృతమై ఉన్నాయి. మిగిలిన జిల్లాలు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, బీహార్, జార్ఖండ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి. బలహీనమైన రుతుపవనాల ప్రభావాన్ని తట్టుకునేందుకు పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు, నూనె గింజల సాగువైపు రైతులను ప్రోత్సహించాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించింది. పంటల వైవిధ్యం, తేమ సంరక్షణ, సమర్థవంతమైన నీటి యాజమాన్యం వంటి వ్యూహాలను అనుసరించాలని తెలిపింది. చెరువుల మరమ్మతులు, చెక్ డ్యామ్‌ల పునరుద్ధరణ, కాలువల్లో పూడికతీత, నీటి సంరక్షణ నిర్మాణాల విస్తరణ ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని బలోపేతం చేయాలని రాష్ట్రాలను ఆదేశించింది. మరోవైపు 2026 ద్వితీయార్థంలో ఎల్ నినో తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉందని ఐక్యరాజ్యసమితి వాతావరణ సంస్థ హెచ్చరించింది. 'సౌత్ ఏషియన్ ?÷–లకెమేట్ అవుట్ లుక్ ఫోరం' అంచనాల ప్రకారం భారతదేశంలో దీర్ఘకాలిక సగటు వర్షపాతంలో కేవలం 90 శాతం మాత్రమే కురిసే అవకాశం ఉంది. తీవ్రమైన ఉష్ణోగ్రతలు, నీటి ఎద్దడి కారణంగా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎల్ నినో వల్ల అనావృష్టి ఏర్పడి ఆహార ద్రవ్యోల్బణం పెరిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

## మరో నాలుగు చెరువుల పునరుద్ధరణ

### 107 కోట్లతో చేపట్టిన హైడ్రా

హైదరాబాద్,

నగరంలో వరదల కట్టడి, భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీచెరువుల పునరుద్ధరణకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రూ. 107 కోట్ల భారీ వ్యయంతో మరో నాలుగు ప్రముఖ చెరువుల అభివృద్ధి పనులను హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ అధికారికంగా ప్రారంభించారు. ఇబ్రహీంపట్నంలోని పెద్ద చెరువు, కాముని చెరువుల వద్ద ఆయన స్వయంగా భూమి పూజ చేసి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. హైడ్రా చేపట్టిన ఈ పునరుద్ధరణ జాబితాలో ఇబ్రహీం పెద్ద చెరువు, భగీరథమ్మ చెరువు, కాముని చెరువు, కాప్రా చెరువులు ఉన్నాయి. మొత్తం 311 ఎకరాల భారీ విస్తీర్ణంలో ఉన్న ఈ నాలుగు చెరువులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేలా పక్కా ప్రణాళికను సిద్ధం చేశారు. వీటిని కేవలం జలాశయాలుగానే కాకుండా, స్థానికులకు ఆహ్లాదాన్ని పంచే అద్భుతమైన పర్యాటక కేంద్రాలుగా మార్చనున్నారు. ఇందులో భాగంగా చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు, పిల్లల కోసం ప్రత్యేక ప్లే ఏరియాలను ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు పెద్ద చెరువుల్లో పర్యాటక శాఖ సహకారంతో త్వరలోనే బోటింగ్ వ్యవస్థను కూడా అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

PRGI NO: TGTEL/25/A5314

అర్జున్ సమాచారం

www.arjunsamaachaaram.in

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : లింగం రాజయ్య

బ్యూరో చీఫ్ : గిరవెన రాకేష్

# సంపాదకీయం...

## ఆత్మీయతకు అద్దం తెలంగాణ భాష

తెలంగాణ ఆత్మీయతకు.. అద్దం. తెలంగాణ భాష. తెలంగాణ యాస భాషను అవహేళన చేయడం వెక్కిరించడం అంటే.. తెలంగాణ సమాజాన్ని అవమానించడమే అవుతుంది. ఇటువంటి అనేక అవమానాలను తెలంగాణ గడ్డ ఆరు దశాబ్దాలుగా ఎదుర్కొన్నది. నిజానికి తెలంగాణ యాసభాషలో జీవం ఉన్నది. ప్రతీ ఒక్కరినీ ప్రేమగా గుండెలకు హత్తుక్కొని గొప్ప భరోసా చెప్పినట్లుంటుంది. పరాయి వారిని సైతం చేరదీసే గొప్ప సంస్కృతి తెలంగాణది. తెలంగాణ ప్రజల నిస్వార్థ జీవన విధానంలో నుంచి పుట్టిందే ఈ భాష. తెలంగాణకు యాస భాషనే కిరీటం. తెలంగాణకు ఉన్న గొప్ప చరిత్ర అంతా యాస భాషలోనే కన్పిస్తుంది. ఏ స్వార్థం లేని జీవన విధానం నుంచి వస్తున్న తెలంగాణ స్వచ్ఛమైన సంపద తెలంగాణ యాసభాష. తెలంగాణ భాష అందరికీ సులువుగా అర్థం అయ్యేలా ఉంటుంది. అందరినీ తనవారుగా చేరదీసే గొప్పతత్వం తెలంగాణ గడ్డది. తెలంగాణ గడ్డను హేళన, అవహేళనలతో ఆరు దశాబ్దాలుగా ఆగం చేస్తూ వచ్చారు. ఫలితంగా తెలంగాణ తరతరాల వారసత్వ సంస్కృతి, సాంప్రదాయాలు, తెలంగాణ అస్తిత్వాన్ని అంతా అణచివేయబడింది. ఆ అణచివేతను తట్టుకోలేకనే ఆత్మగౌరవ బతుకుల కోసం మా సంస్కృతి, సాంప్రదాయాలు, పాలన కోసం ఉవ్వెత్తున ఉద్యమం సాగింది. బలవంతంగా కలిపిన ఆంధ్ర – తెలంగాణ రాష్ట్రాలను కలిపి తెలంగాణ అస్తిత్వాన్ని కనమరుగు చేస్తున్న తరుణంలో అస్తిత్వ పోరాటం జరిగి పరాయి ఆధిపత్యానికి ఇడుపు కాయితం ఇచ్చి ఇప్పుడు స్వేచ్ఛగా తెలంగాణ ప్రపంచ దేశాలలో తన అస్తిత్వాన్ని చాటుకుంటుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా తెలంగాణ మీద ఇంకా కొందరి అవహేళనలు, వ్యంగ్యపు మాటలతో తెలంగాణ గౌరవాన్ని దెబ్బతీయాలనే కుట్రలు రోజురోజుకు ఎక్కువే అవుతున్నాయి. తెలంగాణ ఏర్పడిన తరువాత ఈ పుష్కర కాలంలో తెలంగాణ సాంస్కృతి, సాంప్రదాయాలు, తెలంగాణ యాస భాష, తెలంగాణ ఆత్మీయత ఎందరికో ఆదర్శంగా, ఆత్మీయంగా నిలుస్తున్నది. తెలంగాణకు పేరు ప్రఖ్యాతలు వచ్చే ప్రతీ సందర్భాన్ని అవహేళనతో చూడడం పరిపాటిగా మారిపోయింది. ఈ మధ్య తెలంగాణలో అనేక చిత్రాలు ఇక్కడి యాస భాషతో తీస్తున్నారు. ఒకప్పుడు సినిమాల్లో తక్కువగాచేసి చూపిన యాస భాషనే ఇప్పుడు గొప్పగామారి సినీ ప్రపంచంలో ఓ ట్రెండ్‌ను సృష్టిస్తున్నాయి. అటువంటి తరుణంలోనే ఓ సాధారణ నటులతో 'ఇడుపు కాయితం' అనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్న సందర్భంగా తెలంగాణ భాషను అగౌరవపరిచేలా ఆంధ్రలో డబ్బింగ్ చేస్తారా అంటూ వ్యంగ్యపు చేష్టలతో తెలంగాణ భాష గౌరవాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. తెలంగాణ గడ్డ ఎంతో ఆత్మీయత కలిగినది. ఈ గడ్డకు చేరదీసే గొప్ప గుణమే తప్ప ఈసడించుకోవడం తెలియదు. అటువంటి తెలంగాణ భాషపట్ల చిల్లర వ్యాఖ్యలు చేయడం అంటే తెలంగాణ గడ్డను అవమానించడమే అవుతుంది. ఆరు దశాబ్దాలు తెలంగాణ భాష, యాష, బతుకు మీద, భవిష్యత్తు మీద దాడి చేశారు ఆంధ్రపాలకులు. అయినా తెలంగాణ గడ్డ తెగింపుతో అస్తిత్వాన్ని కాపాడుకొని మళ్లీ ఆత్మీయతను పంచుతూ గర్వంగా నిలబడుతుంది. అటువంటి తరుణంలో భిన్న రంగాలలో వస్తున్న మార్పులతోపాటు సినీ రంగంలో ఈ ప్రాంత ప్రజల ఆత్మీయత, ప్రేమానురాగాలకు అద్దం పట్టేలా సినిమాలు వస్తున్నాయి. అటువంటి సినిమాలను ప్రజలూ గొప్పగా ఆదరిస్తున్నారు. అటువంటి తరుణంలో తెలంగాణ భాషను అవహేళనగా మాట్లాడడం నిజంగా దౌర్భగ్యం. తెలంగాణ భాషను వెక్కిరించడం అంటే తెలంగాణ సమాజాన్ని చిన్నచూపు చూడడమే అవుతుంది. సమాజంలో నివసించే వ్యక్తులు ఆదరించే సంస్కృతి, సంప్రదాయాలు, భాషతో ముడిపడిన బంధం. మనుషులను పరస్పరం గౌరవించుకునే సంప్రదాయం. ఆత్మీయతకు తెలంగాణ పెట్టింది పేరు. మానవత్వం కలిగిన నేల. ఈ నేలలో ఒకసారి తమ వారిగా భావిస్తే తన పొత్తిళ్లలో దాచుకుని ప్రేమను పంచే గుణం గల నేల. అటువంటి తెలంగాణ నేల అనేకమైన సంప్రదాయాలకు, సంస్కృతి అద్దం పట్టే విధంగా ఉంటుంది.

## నిరుపేదల కళ సొంత ఇల్లు, నెరవేర్చడమే ప్రభుత్వ ధ్యేయం... ఎస్.సూర్య మోహన్ రెడ్డి

– పసుపుల గ్రామంలో నూతన ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం :



నిరుపేదల ఆకాంక్ష సొంతింటి కల అని అట్టి కలను ప్రజా ప్రభుత్వం అయినా కాంగ్రెస్ ఇందిరమ్మ ఇళ్ళను కట్టించి నిరుపేదల బ్రతుకుల్లో మార్పు తెస్తున్నదని నారాయణపేట జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎస్.సూర్యమోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మరికల్ మండలం పసుపుల గ్రామంలో జోగు రాజమణి, జోగు నర్సింహాలు నూతన ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్.సూర్య మోహన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆకాంక్ష సొంతింటి కల నెరవేర్చుకోవడం ప్రతి ఒక్కరి కళ అని అన్నారు. నిరుపేదల కలను నెరవేర్చడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు ద్వారా ఐదు లక్షల రూపాయలు విడతల వారీగా నిధులు సమకూర్చి ఇందిరమ్మ ఇళ్ళను సమర్థవంతంగా కట్టించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు బి.హర్షవర్ధన్ రెడ్డి, గ్రామ సర్పంచ్ నర్మదా రవి కుమార్ గౌడ్, ఉప సర్పంచ్ మహేష్ కుమార్, వార్డు సభ్యులు నర్సింహాలు, జక్లేర్ గోవిందమ్మ, మాజీ ఎంపీటీసీ జయమ్మ, పంచాయతీ కార్యదర్శి శేఖర్, కాంగ్రెస్ నాయకులు బెళగొంది వీరన్న, పట్టణ అధ్యక్షులు కే.హరీష్ కుమార్, నాయకులు రామకృష్ణ, జంగిడి రవి, రామకృష్ణ రెడ్డి, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## : రైతులకు జాతీయ ఆహార భద్రత పథకం కింద ఆర్ఎన్ఆర్-15048 వరి విత్తనాల పంపిణీ ;

నారాయణపేట జిల్లా వ్యవసాయ అధికారిణి సక్రియ నాయక్ పరిశీలనలో నడుస్తున్న కార్యక్రమంలో జాతీయ ఆహార భద్రత పథకం (ఎన్ఎఫ్ఎస్ఎం) కింద మరికల్ గ్రామ రైతులకు ఆర్ఎన్ఆర్-15048 రకం వరి విత్తనాలు పంపిణీ చేయబడ్డాయి. జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ, నూతన సాగు పద్ధతిని అవలంబిస్తే విత్తన వినియోగం తగ్గి, నీటి ఆదా, సాగు ఖర్చుల నియంత్రణతో పాటు అధిక దిగుబడులు సాధించగలమనే చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సాగు పథకాలను గడచిన సరసమైన విధంగా ఉపయోగించుకొని శాస్త్రీయ సాగు పద్ధతులను అనుసరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో, మరికల్ గ్రామ సర్పంచ్ గుపా చెన్నయ్య, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సూర్య మోహన్ రెడ్డి, మండల అధ్యక్షుడు హర్షవర్ధన్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు హరీష్, పెంట మీది రాఘవేందర్, గ్రామ రైతులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అధికారి రెహమాన్, వ్యవసాయ విస్తరణ అధికారి పరుశురాం, తదితరులు పాల్గొన్నారు.

## మల్దకల్‌లో ఘనంగా ప్రపంచ టూ వీలర్ మెకానిక్ దినోత్సవం: జెండా ఆవిష్కరించిన ఎస్ఐ శ్రీహరి

గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలో ప్రపంచ టూ వీలర్ మెకానిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మెకానిక్‌లు ఘనంగా వేడుకలు నిర్వహించారు. సీనియర్ మెకానిక్, తాటికుంట మాజీ సర్పంచ్ అంజి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మల్దకల్ ఎస్ఐ శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీహరి మాట్లాడుతూ.. ప్రతీ టూ వీలర్ మెకానిక్ తమ వద్దకు వచ్చే వాహనదారులకు హెల్మెట్ ధరించడంపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ప్రయాణాల్లో ప్రాణ రక్షణకు హెల్మెట్ ఎంతో కీలకమని వివరించారు. అదేవిధంగా, ఎవరైనా అనుమానాస్పదంగా దొంగ బైక్‌లను అమ్మడానికి వస్తే తక్షణమే పోలీసులకు



సమాచారం అందించి సహకరించాలని కోరారు. ఈ వేడుకల్లో తాటికుంట మాజీ సర్పంచ్ అంజి, మండలంలోని సీనియర్ మెకానిక్‌లు, సంఘ సభ్యులు మరియు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


అర్జున్ సమాచారం


www.arjunsamaachaaram.in

తెలుగు దినపత్రిక

# ఆట







## మ్యారేజ్ పుకార్లకు కావ్య మారన్ చెక్!

ఐపీఎల్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈఓ అయిన కావ్య మారన్ వివాహానికి సంబంధించి ఒక కీలకమైన అప్‌డేట్ బయటపడింది. ఫేమస్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్‌తో ఆమె వివాహంపై ఖాయమైందని తెలుస్తోంది. అయితే, కావ్య వివాహం అకస్మాత్తుగా చర్చనీయాంశంగా ఎలా మారిందనే ప్రశ్న తలెత్తుతోంది. నిజానికి, అనిరుద్ధ మామ, నటుడు వైజీ మహేంద్ర, కావ్య, అనిరుద్ధల వివాహం గురించి మాట్లాడారు. కేపీటీవీకి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో, అనిరుద్ధ వివాహం గురించిన ప్రశ్నకు వైజీ మహేంద్ర స్పందిస్తూ, "అనిరుద్ధ చాలా కూల్‌గా ఉండే అబ్బాయి.

## భూకంప బాధితుల కోసం నేమార్ భారీ విరాళం

బ్రెజిల్ ఫుట్‌బాల్ సంచలనం నేమార్ వెనిజులాలో సంభవించిన అత్యవసర రెస్క్యూ, మానవతా సహాయక చర్యల కోసం ఏకంగా 2,50,000 యూఎస్ డాలర్ల భారీ విరాళం ఇచ్చాడు. ఈ నిధులను భూకంప బాధితులకు తక్షణమే అవసరమైన ఫుడ్, తాగునీరు, మెడికల్ సప్లైస్, తాత్కాలిక షెల్టర్లు ఏర్పాటు చేయడానికి ఉపయోగించనున్నారు. "నా హృదయం వెనిజులా ప్రజల కోసమే తపిస్తోంది" అని నేమార్ ఎమోషనల్ అయ్యాడు. తన వంతుగా ఇచ్చిన ఈ సాయం దారుణంగా దెబ్బతిన్న ఎన్నో కుటుంబాలకు ధైర్యాన్ని, ఉపశమనాన్ని ఇస్తుందని ఆశిస్తున్నట్లు నేమార్ చెప్పాడు. వెనిజులా నేషనల్ అసెంబ్లీ ప్రెసిడెంట్ జార్జ్ రోడ్రిగ్జ్ అక్కడ జరిగిన నష్టాన్ని వివరించాడు. బుధవారం సంభవించిన భయంకరమైన ట్విన్ భూకంపాల (రెండు భారీ భూకంపాలు) వల్ల కనీసం 1,430 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ విపత్తులో 3,238 మందికి పైగా తీవ్రంగా గాయపడగా, ఇళ్లు కోల్పోవడం వల్ల 3,142 కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. రిక్టర్ స్కేలుపై 7.2, 7.5 తీవ్రతతో వచ్చిన ఈ భూకంపాల తర్వాత కూడా వందలాది ఆఫ్టర్ షాక్స్ వస్తుండటంతో రెస్క్యూ టీమ్స్ ప్రాణాలతో ఉన్న వారిని కాపాడటానికి తీవ్రంగా శ్రమిస్తున్నాయి. భారీ మిషనరీ కొరత వల్ల సహాయక చర్యలు కాస్త స్లోగా సాగుతున్నాయి. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో బ్రెజిల్ ఫ్యాన్స్ కు ఒక అదిరిపోయే స్పోర్ట్స్ అప్‌డేట్ అందింది. గాయం నుంచి కోలుకుంటున్న నేమార్ ప్రెజెంట్ పూర్తి ఫిట్‌నెస్ సాధించాడని, జపాన్‌తో జరగబోయే ఫిఫా క్లబ్ వరల్డ్ కప్ రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్ లో ఎక్కువ సమయం ఆడేందుకు రెడీ అయ్యాడని బ్రెజిల్ హెడ్ కోచ్ కార్లో అన్సెలొట్టి హింట్ ఇచ్చాడు. లాస్ట్ వీక్‌తో పోలిస్తే 34 ఏళ్ల నేమార్ ఫిట్‌నెస్ లెవెల్స్ అద్భుతంగా మెరుగయ్యాయని కోచ్ చెప్పాడు. వరల్డ్ కప్ ఫస్ట్ రెండు మ్యాచులకు దూరమైన నేమార్, స్కాట్లాండ్‌పై బ్రెజిల్ 3-0 తో సాధించిన విక్టరీలో లాస్ట్ 15 నిమిషాలు మాత్రమే సబ్‌స్టిట్యూట్ గా గ్రౌండ్ లోకి వచ్చాడు. ఇప్పుడు తను ఎక్కువ సేపు ఆడేందుకు వీలుగా రికవర్ అయ్యాడని కోచ్ క్లారిటీ ఇచ్చాడు. గ్రూప్-జ లో టాప్ పొజిషన్ లో నిలవడం ద్వారా బ్రెజిల్ టీమ్ వరల్డ్ కప్ హిస్టరీలోనే ఒక అరుదైన రికార్డును కంటిన్యూ చేసింది. వరుసగా 12 వరల్డ్ కప్ టోర్నమెంట్లలో గ్రూప్ స్టేజ్ లో టాపర్‌గా నిలిచిన ఏకైక జట్టుగా బ్రెజిల్ సరికొత్త హిస్టరీ క్రియేట్ చేసింది. 1982 వరల్డ్ కప్ నుంచి ఇప్పటివరకు ప్రతీసారి బ్రెజిల్ తమ గ్రూప్‌లో నంబర్ వన్ సీటును అస్సలు వదులుకోలేదు. ఈ అద్భుతమైన 44 ఏళ్ల గ్రూప్-స్టేజ్ డామినేషన్ ను బ్రెజిల్ సక్సెస్ ఫుల్ గా కాపాడుకుంది. నాకౌట్ లో జపాన్‌ను దెబ్బకొట్టడానికి నేమార్ ఎంట్రీ ఇవ్వడం టీమ్‌కు కొండంత బలాన్ని ఇస్తుందని మేనేజ్‌మెంట్ భావిస్తోంది.

## రగ్బీ ప్రీమియర్ లీగ్ సీజన్ 2 ఛాంపియన్‌గా అవతరించిన హైదరాబాద్ హీరోస్!

హైదరాబాద్

గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన హెచ్‌ఎస్‌బీసీ రగ్బీ ప్రీమియర్ లీగ్ (ఆర్‌పీఎల్) రెండో సీజన్ ఫైనల్స్‌లో హైదరాబాద్ హీరోస్ జట్టు అద్భుతమైన ప్రదర్శనతో ముంబై డ్రీమర్స్‌ను 41-17 స్కోరుతో చిత్తు చేసి చాంపియన్‌గా అవతరించింది. ఆదివారం జరిగిన ఈ మెగా ఫైనల్ మ్యాచ్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జీఎంఆర్ స్పోర్ట్స్, రగ్బీ ఇండియా సంయుక్త అధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్ భారతీయ రగ్బీకి కొత్త మైలురాయి అయింది. ప్రపంచ స్థాయి ఆటగాళ్లు, భారీ ప్రేక్షకులు, మహిళల లీగ్‌తో పాటు ఈ సీజన్ అన్ని విధాలా విజయవంతంగా ముగిసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ హీరోస్ జట్టుకు ట్రోఫీని బహూకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, జూ=+ చైర్మన్ శివసేనా రెడ్డి తదితరులు కూడా హాజరయ్యారు. ఫైనల్ మ్యాచ్‌ను వీక్షిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ఆటగాళ్ల స్ఫూర్తిని ప్రశంసించారు. ఈ ఈవెంట్ హైదరాబాద్‌ను క్రీడా హబ్‌గా మార్చడంలో కీలక పాత్ర పోషించింది. జీఎంఆర్ గ్రూప్ కార్పొరేట్ చైర్మన్ కిరణ్ కుమార్ గ్రాంధి, మెగాస్టార్ చిరంజీవి, పీవీ సింధు, మృణాళ్ ఠాకూర్ వంటి ప్రముఖులు కూడా ముగింపు వేడుకలకు హాజరై ఈ క్రీడను మరింత ఆకర్షణీయం చేశారు. హైదరాబాద్ హీరోస్ జట్టు ఫైనల్‌లో క్లినికల్ ప్రదర్శనతో ముంబైని అధిగమించింది.

# బిఆర్ఎస్ అప్పులు అక్షరాలా రూ. 8,21,651 కోట్లు

### అనేక సంస్థలకు వేలకోట్ల బకాయిలు పెట్టిన ఘనులు

### చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు డ్రామాలు

### నాటి అప్పులు, తప్పులపై కెసిఆర్ స్పందించాలి

### హరీష్ రావు అబద్దాలను కట్టిపెడితే మంచిది

### డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క స్ట్రాంగ్ వార్నింగ్



హైదరాబాద్,

గత కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో చేసిన భారీ అప్పులు, వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రస్తుతం లేనిపోని అబద్దాలను ప్రచారం చేస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన తప్పులను తక్కువ చేసి చూపించేందుకు మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ప్రయత్నిస్తున్నారని భట్టి విక్రమార్క అన్నారు. మంత్రిగా పనిచేసిన విషయాన్ని మరిచిపోయి హరీశ్ మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర సచివాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై స్పష్టమైన లెక్కలను బయటపెట్టిన ఆయన.. గత పాలకులు రాష్ట్రంపై సుమారు రూ. 8,21,651 కోట్ల అప్పులు, బకాయిల భారాన్ని మిగిల్చారని, వాటిని ప్రస్తుత ప్రభుత్వం ఎంతో శ్రమతో క్రమబద్ధీకరిస్తోందని వెల్లడించారు. అలాగే రెసిడెన్షియల్ పాఠశాలల్లోని పిల్లలకు నాణ్యమైన భోజనం, బట్టలు , కనీస సౌకర్యాలను కల్పించడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, తమ ప్రభుత్వం వచ్చాకే విద్యా సంస్థల్లోని వసతులను మెరుగుపరిచి సంక్షేమానికి పెద్దపీట వేసిందని స్పష్టం చేశారు. సింగరేణి సంస్థపై ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను డిప్యూటీ సీఎం తీవ్రంగా ఖండించారు. బొగ్గు గనుల కేటాయింపులు, ఉత్పత్తికి సంబంధించి గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించి సంస్థను నష్టాల్లోకి నెట్టిందని, ప్రస్తుత ప్రభుత్వం సింగరేణిని కాపాడుకోవడానికి అన్ని రకాలుగా ప్రయత్నిస్తోందని వివరించారు. సింగరేణిలో జరిగిన గత ప్రభుత్వ కాలపు అక్రమ వ్యవహారాలపై తాము విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తున్నట్లు ఈ సందర్భంగా భట్టి విక్రమార్క ప్రకటించారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు సోషల్ మీడియాలో, బయటా అబద్ధపు ప్రచారాలు చేయడం మానుకోవాలని హెచ్చరించిన ఆయన, దమ్ముంటే తమతో నేరుగా బహిరంగ చర్చకు రావాలంటూ మాజీ సీఎం కేసీఆర్‌కు సవాల్ విసిరారు.బీఆర్ఎస్ పాలనలో చేసిన అప్పులపై కేసీఆర్ స్పందించాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో మొత్తం అప్పు రూ.8.21 లక్షల కోట్లు అని.. మొత్తం అప్పుల్లో గత ప్రభుత్వ బకాయిలు ఉన్నాయని తెలిపారు. అప్పులు అన్నీ వాస్తవాలు కాదా.. వీటిని ఎవరు చెల్లిస్తారని ప్రశ్నించారు. అప్పులపై కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పులను తక్కువ చేసి చూపేందుకే కేటీఆర్, హరీశ్ ప్రయత్నిస్తున్నారని ఉపముఖ్యమంత్రి మండిపడ్డారు. మంత్రిగా పనిచేశానని మర్చిపోయి మరీ హరీశ్ మాట్లాడుతున్నారని.. అనేక అంశాలపై అబద్దాలు చెబుతున్నారని వ్యాఖ్యానించారు. వాస్తవాలను ప్రజల దృష్టికి తేవాలన్నారు. బీఆర్ఎస్ నేతల అబద్దాలు ప్రజల్లోకి వెళ్లకూడదన్నారు. సోషల్ మీడియా ద్వారా అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్దాల పునాదులపై పదేళ్లు పరిపాలించారని.. బీఆర్ఎస్ చేసిన అప్పులతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని విరుచుకుపడ్డారు. అప్పుల భారం రాష్ట్రంపై వేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. బుకాయింపులు, అసత్యాలతో ఎన్నాళ్లు మోసం చేస్తారంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు అనేక విషయాలపై అబద్దాలు చెబుతున్నారు. వాస్తవాలను ప్రజల దృష్టికి తీసుకురావాలి. బీఆర్ఎస్ నేతలు చెప్పే అవాస్తవాలు ప్రజల్లోకి వెళ్లకూడదు. సోషల్ మీడియా వ్యవస్థల ద్వారా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. అబద్దాల పునాదులపై పదేళ్లపాటు పరిపాలన చేశారు. బీఆర్ఎస్ నేతలు కావాలనే ప్రభుత్వంపై పదేపదే దుష్ప్రచారం చేస్తున్నారు. ఆ పార్టీ హయాంలో చేసిన అప్పులతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. పదేళ్లు సీఎంగా పనిచేసిన కేసీఆర్‌కు సవాల్ విసురుతున్నాం. 2014 నుంచి 2023 వరకు అప్పులు చేసి రాష్ట్రంపై పెనుభారం వేసింది నిజం కాదా? వివిధ మార్గాల ద్వారా మీరు చేసిన అప్పు రూ.8.21లక్షల కోట్లు. బుకాయింపులు, అసత్యాలతో ఎన్నాళ్లు మోసం చేస్తారు?అప్పుల అంశంపై నిత్యం మాట్లాడితే రాష్ట్రం పరువు పోతుందని తగ్గాం. మేం వచ్చాక రూ.2.08లక్షల కోట్లు చెల్లించాం. 10 శాతం వడ్డీకి కూడా మీరు అప్పులు తెచ్చారు. కట్టాల్సిన వడ్డీని రూ.34 వేల కోట్ల నుంచి రూ.11వేల కోట్లకు తగ్గించాం. బీఆర్ఎస్ నేతలు అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. సింగరేణిపై ప్రతిరోజూ అబద్దాలు చెబుతున్నారు‘ అని భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అబద్దాల లేఖలతో ప్రచారం చేస్తున్న హరీష్ రావు

### ప్రెస్‌క్లబ్‌కు చేరుకున్న జూపల్లి

### సవాల్‌పై కట్టుబడి ఉన్నందునే వచ్చానని వెల్లడి

### బిఆర్ఎస్ నేతల తీరుపై మండిపడ్డ మంత్రి





హైదరాబాద్,

తెలంగాణ అప్పులపై సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో చర్చకు సిద్ధమని ప్రకటించిన మంత్రి జూపల్లి కృష్ణారావు సాయంత్రిం ప్రెస్‌క్లబ్‌కు వచ్చారు. శుక్రవారం ఉదయం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌కు ఆయన సవాల్ విసిరారు. సాయంత్రం 5 గంటలకు సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కు వస్తానని చెప్పారు. ఈ మేరకు మంత్రి జూపల్లి శుక్రవారం సాయంత్రం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కు చేరుకున్నారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. సవాల్‌పై కట్టుబడి ఉన్నందునే ప్రెస్‌క్లబ్‌కు వచ్చానన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు కోసం ఎదురుచూస్తున్నానని తెలిపారు. తాను వెనుకడుగు వేసి పారిపోయే వ్యక్తిని కానన్నారు.. 'కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు 4 పేజీల చొప్పున లేఖలు రాశా. ముగ్గురికీ వాట్సాప్‌లోనూ ఆధారాలతో లేఖలు పంపించా. రూ.4.17 లక్షల కోట్ల అప్పు అంటూ హరీశ్ రిటర్న్ లేఖ పంపారు. రూ.8.21 లక్షల కోట్ల అప్పు అని లేఖలో చెప్పా. పారిపోవడం మా ఇంటావంటా లేదు. ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. లేఖలో తాను ప్రస్తావించినవి అబద్దాలని నిరూపించ గలరా అని మంత్రి ప్రశ్నించారు. తాను చెప్పినవి అబద్దాలైతే రాజీనామాకు సిద్ధం అంటూ పునరుద్ఘాటించారు. హరీశ్‌రావు సొల్లు పురాణం చెబుతున్నారు. నా ప్రశ్నలకు సమాధానం దాటవేస్తున్నారు. నేను అడిగింది ఏంటి? హరీశ్ చెప్పిందేంటి అని నిలదీసారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ కోసం 3 కుర్చీలు వేశాం. హరీశ్‌రావు రాసిన లేఖలో ఏమీ లేదు. ఇప్పటికైనా విలువలతో బతకండి’ అని అన్నారు. కాగా, చర్చకు రావాలని పిలిచి పోలీసులతో అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## బిఆర్ఎస్ హయాం అప్పులపై తప్పుడు ప్రచారం

### తొమ్మిదిన్నరేళ్లలో తీసుకున్న రుణాలు రూ.4.17 లక్షల కోట్లే

### మంత్రి జూపల్లి కీష్ణారావుకు హరీష్ రావు లేఖ

హైదరాబాద్,

బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులపై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు... ఈ మేరకు మంత్రి జూపల్లి కృష్ణారావుకు బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో చేసిన ప్రసంగాల వీడియోలు, ఆర్బీఐ గణాంకాలు సహా పలు ఆధారాలను మంత్రి జూపల్లి వాట్సాప్‌కు పంపినట్లు వెల్లడించారు. హరీశ్‌రావు లేఖలో పేర్కొన్న వివరాల ప్రకారం.. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేళ్ల పాలనలో తీసుకున్న రుణాలు, ప్రభుత్వ హామీతో తీసుకున్న రుణాలు కలిపి మొత్తం రూ.4.17 లక్షల కోట్లేనని అసెంబ్లీలో వివరించినట్లు తెలిపారు. ఆ లెక్కలపై ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధమని అప్పుడే ప్రకటించానని గుర్తు చేశారు. అలాగే, కాంగ్రెస్ ప్రభుత్వం 2023 డిసెంబర్ నుంచి 2026 జూన్ వరకు రూ.1,77,058 కోట్ల అప్పు చేసినట్లు మంత్రి జూపల్లి తన లేఖలో పేర్కొన్నారని తెలిపారు. అయితే, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గణాంకాల ప్రకారం 2026 జూన్ 30 నాటికి రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పు రూ.1,86,067 కోట్లుగా ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు. మరోవైపు, 2026 మార్చి 18న అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రభుత్వం చేసిన ఎఫ్‌ఆర్‌బీఎం, ఇతర అన్ని రకాల రుణాలు కలిపి రూ.3,47,294 కోట్లుగా ప్రకటించారని ఆయన గుర్తు చేశారు. బీఆర్ఎస్ తమ లెక్కలను మార్చడం లేదని, కాంగ్రెస్ మాత్రం సందర్భానుసారంగా అప్పుల అంకెలను మారుస్తోందని విమర్శించారు. తమ అంచనాల ప్రకారం వివిధ మార్గాల ద్వారా ప్రస్తుత ప్రభుత్వం సుమారు రూ.4.5 లక్షల కోట్ల అప్పులు చేసిందని హరీశ్‌రావు ఆరోపించారు. ఈ అంశానికి సంబంధించిన అసెంబ్లీ వీడియోలు, ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలు, ఆర్బీఐ అధికారిక గణాంకాలను మంత్రి జూపల్లి వాట్సాప్‌కు పంపినట్లు తెలిపారు. వాటిని పరిశీలించి వాస్తవాలను తెలుసుకోవాలని కోరిన హరీశ్‌రావు, ఇకనైనా అప్పుల అంశంలో తప్పుడు ప్రచారం మానుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు.



## కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతల నటన అద్భుతం

### కేంద్రమంత్రి బండి సంజయ్ ఎద్దేవా




హైదరాబాద్,

కాంగ్రెస్, భారాస నేతల నటన అద్భుతంగా ఉందని, బిగ్‌బాస్ షోను తలపిస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ గురువారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. ప్రజలు మీ నాటకాలు చూసి నవ్వుకుంటున్నారు. అబద్దాలకు ఆస్కార్ అవార్డు ఇస్తే రెండు పార్టీలూ అర్హత సాధిస్తాయని అన్నారు. గురుకులాల టెండర్లు, తెలంగాణ అప్పులతోపాటు అవినీతి, అక్రమాలపైనా చర్చిద్దాం రండి. మా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఆధ్వర్యంలో తేదీ, సమయం, వేదిక నిర్ణయిస్తాం. కాంగ్రెస్, భారాస పాలనా వైఫల్యాలను ప్రజల ముందుంచేందుకు మేం సిద్ధం. మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి ఖర్చు చేసిన నిధులు, అందించిన సంక్షేమ కార్యక్రమాలపైనా చర్చిద్దాం. తెలంగాణలోనూ డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని సంజయ్ అన్నారు.

## భావ ప్రకటన స్వేఛ అంటే బూతుల ప్రచారమా?

### సోషల్ మీడియాలో పవన్‌పై విమర్శలు తగవు

### మండిపడ్డ మంత్రి కందుల దుర్గేశ్

విజయవాడ

:సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు, వ్యక్తిగత దూషణలు, తప్పుడు ప్రచారాలపై రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తీవ్రంగా స్పందించారు. భావప్రకటన స్వేచ్ఛ అంటే బూతుల లైసెన్స్ కాదని హెచ్చరించారు. సోషల్ మీడియాను దుర్వినియోగం చేసే వారిపై చట్టం కఠినంగా వ్యవహరిస్తుందని తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని కొందరు సోషల్ మీడియాలో కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్‌ను రాజకీయంగా బలహీనపరిస్తే కూటమి ప్రభుత్వాన్ని దెబ్బతీయవచ్చన్న వ్యూహంతో వైసీపీ వ్యవహరిస్తోందని విమర్శించారు. కేవలం వ్యూస్ పెంచుకోవడం, బ్లాక్‌మెయిలింగ్ కోసం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేరును ఉపయోగించడం సరికాదని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ప్రశ్నించే హక్కుంది.. కానీ హద్దులు దాటే హక్కు లేదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాపై నియంత్రణ అవసరమని అభిప్రాయపడ్డారు. ఈసందర్భంగా రుషికొండ ప్యాలెస్ అంశంపైనా మంత్రి స్పందించారు. రుషికొండ ప్యాలెస్‌ను పర్యాటకాభివృద్ధి, ప్రజల సందర్శన కోసం వినియోగించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్‌ను ఆహ్వానించినట్లు వెల్లడించారు. గత ప్రభుత్వ విధానాల కారణంగా పర్యాటక శాఖకు ఏటా సుమారు రూ.7 కోట్ల నష్టం వాటిల్లిందని, ఇకపై పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటామని మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు.

## స్వాధీనం చేసుకున్న విమానం వేలం

### దేశంలో తొలిసారిగా ఇడి సంచలన నిర్ణయం

హైదరాబాద్

దేశంలోనే తొలిసారిగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈడీ స్వాధీనం చేసుకున్న ఓ విమానాన్ని ఈ-వేలం ద్వారా విక్రయించింది. హైదరాబాద్ జోనల్ ఈడీ స్వాధీనం చేసుకున్న హాకర్ 800 విమానాన్ని విక్రయించేందుకు ఈ నెల 1న ఎంఎస్‌టీసీ ద్వారా ఆక్షన్ నిర్వహించగా.. రూ.3 కోట్లకు అమ్ముడుపోవడం విశేషం. హాకర్ 800 విమానం అనేది అంతకుముందు ఫాల్కన్ పోంజీ కేసు ప్రధాన నిందితుడు అమర్‌దీప్ కుమార్‌కు చెందినది. అయితే అమర్‌దీప్ నకిలీ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ పేరుతో రూ.792 కోట్ల మోసానికి పాల్పడినట్టు ఈడీ తేల్చింది. దర్యాప్తులో భాగంగా ఈ విమానాన్ని గత మార్చి 7న ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత.. చట్టపరమైన పక్రియ ద్వారా, పీఎంఎల్ఏ అడ్జుడికేటింగ్ అథారిటీ అనుమతితో దీనిని ఈ-వేలంలో రూ.3 కోట్లకు విక్రయించారు. ఈ సొమ్మును బాధిత పెట్టుబడిదారులకు తిరిగి చెల్లించనున్నారు. కాగా.. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులు అరెస్ట్ అవ్వగా, దర్యాప్తు కొనసాగిస్తున్నట్టు ఈడీ తెలిపింది. అయితే.. ఈడీ స్వాధీనం చేసుకున్న విమానాన్ని పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో విక్రయించడం దేశంలో ఇదే తొలిసారి కావడం విశేషం. ఆస్తుల విక్రయ పక్రియలో పారదర్శకత, పోటీ వాతావరణం కల్పించడం సహా ప్రభుత్వ ఆదాయాన్ని మరింత పెంచే దిశగా ఈ విధానం ఉపయుక్తమవుతుందని అధికారులు భావిస్తున్నారు.

## ఉగ్రవాదాన్ని ఎగదోయడం మానుకోండి

### సింధుజలాలపై పాక్ ప్రేలాపనలపై

### భారత్ మండిపాటు

న్యూఢిల్లీ,

సింధు జలాల్లో తమ వాటా తీసుకొంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందంటూ పాక్ మంత్రి ముసాదిక్ మాలిక్ చేసిన వ్యాఖ్యలపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్రంగా స్పందించింది. దాయాది దేశం ఉగ్రవాదాన్ని ఎగదోయడం, ఉగ్ర కార్యకలాపాలను ప్రోత్సహించడం మానుకొనే వరకు సింధు జలాల నిలిపివేత కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఉగ్రవాదం విషయంలో తమ వైఖరిలో ఎటువంటి మార్పు లేదని తేల్చి చెప్పింది. 1960లో ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో కుదిరిన ఈ ఒప్పందం చట్టబద్ధమైన నిబంధనలు కట్టుబడి ఉంటుందని తెలిపింది. దానిని ఏకపక్షంగా నిలిపివేయడం గానీ.. సవరించడం గానీ సాధ్యం కాదని పాక్‌కు చురకలు అంటించింది. సరిహద్దు ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడాన్ని పాక్ విడనాడాలని విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణధీర్ జయస్వాల్ సూచించారు. సింధు జలాల నియంత్రణకు భారత్ యత్నిస్తోందని.. పాక్‌లోకి చుక్క నీరు కూడా ప్రవహించకుండా పొరుగు దేశ ప్రధాని అడ్డుకుంటున్నారని ఇటీవల పాక్ మంత్రి ముసాదిక్ ఆరోపించారు. తమ నీటి హక్కులకు ముప్పు వాటిల్లితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. మరో మంత్రి అట్టావుల్లా తరార్ మాట్లాడుతూ.. నీటి అంశం తమ దేశ జాతీయ భద్రతలో కీలక భాగమని పేర్కొన్నారు. సింధూ జలాల ఒప్పందం చట్టబద్ధంగా అమల్లోనే ఉందని, దాన్నెవరూ రద్దు చేయలేరంటూ భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. ఈ క్రమంలోనే విదేశాంగ శాఖ దీటుగా స్పందించింది. అఫ్గానిస్థాన్ పై పాకిస్థాన్ సైనిక దాడులను భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఖండించింది. అఫ్గాన్ సార్వభౌమత్వానికి భారత్ మద్దతు కొనసాగిస్తుందని రణధీర్ జయస్వాల్ పునరుద్ఘాటించారు. మానవతా సాయం, అభివృద్ధి ప్రాజెక్టుల ద్వారా ఆ దేశంతో సంబంధాలు కొనసాగుతున్నాయన్నారు. ఇటీవల వెనెజువెలాలో అనుమానాస్పద స్థితిలో భారత నావికుడు రాకేశ్ చౌహాన్ మృతిచెందిన ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది. మృతదేహంలో అవయవాలు మాయం కావడం గురించి అక్కడి అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపింది.

## బాధిత కుటుంబానికి అండగా గ్రామ పెద్దలు.. ఆర్థిక తోడ్పాటుతో భరోసా:



**అర్జున్ సమాచారంజూలై 03 మంచిర్యాల ప్రతినిధి:**

జైపూర్ మండలం లోవేలాల గ్రామానికి చెందిన సుందిళ్ల మదనమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో గ్రామ సర్పంచ్ డేగ స్వప్న--నగేష్ మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి అండగా నిలుస్తూ రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అదే విధంగా 5వ వార్డు సభ్యుడు చీర్ల శిశిందర్ యాదవ్ రూ.2 వేల ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుందిళ్ల రాజలింగు, రాజేష్, మల్లేష్, దేవయ్య, గట్టయ్య, తిరుపతి, చందు, మీసాల మల్లయ్య, రాజయ్య పాల్గొని మృతురాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి.. వెంకట్రావుపల్లెలో అధికారుల విస్తృత పరిశీలన:



**అర్జున్ సమాచారం జూలై 03 మంచిర్యాల ప్రతినిధి:**

పారిశుద్ధ్యం, ఓటరు నమోదు, గ్రామ పంచాయతీ భవన నిర్మాణంపై కీలక ఆదేశాలు జైపూర్ మండలం వెంకట్రావుపల్లె గ్రామ పంచాయతీని శుక్రవారం గౌరవ శ్రీపతి బాపురావు సందర్శించారు. పర్యటనలో భాగంగా గ్రామంలోని పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు.ఇంటి చెత్తను నాలుగు రకాలుగా వేరు చేసి ప్రత్యేక డబ్బాల్లో సేకరించే విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను పరిశీలించారు. మరణించిన వారి పేర్లు ఓటరు జాబితాలో లేకుండా చూడాలని, 18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్వేను వేగంగా పూర్తి చేసి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని గణకునికి సూచనలు చేశారు. గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలించి, నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేలా కాంట్రాక్టర్‌తో నిరంతరం సమన్వయం కొనసాగించాలని సర్పంచ్ జాడి లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి తిరుమలకు ఆదేశాలు జారీ చేశారు.

## ప్రభుత్వపాఠశాలల్లోమౌలిక సదుపాయాలు మెరుగుపరచాలి.

**ఎస్ఎఫ్ఐ భద్రాచలం పట్టణ కార్యదర్శి కొప్పుల.రవీందర్,**

భద్రాచలంపట్టణంలోనిపలుప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పాఠశాలలసర్వేనిర్వహించడంజరిగింది. ఈసందర్భంగాఎస్ఎఫ్ఐనాయకులుకొప్పుల. రవీందర్,మాట్లాడుతూ. పాఠశాలలనుసందర్శించివిద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అలాగేపాఠశాలల్లో అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించివిద్యార్థులతోకలిసిభోజనం చేశారు. సర్వే సందర్భంగా పలు పాఠశాలల్లో బాత్రూమ్‌ల నిర్వహణ సరిగాలేకపోవడం,విద్యార్థులక యూనిఫాంలు,పాఠ్యపుస్తకాలుసకాలంలో అందకపోవడంవంటిసమస్యలుఉన్నట్లుగుర్తించారు. విద్యార్థులకుఅవసరమైన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం వెంటనేకల్పించాలనిడిమాండ్. చేశారు. మధ్యాహ్నభోజనపథకాన్నిమరింతమెరుగుపరచాలని,ప్రభుత్వంనిర్దేశించినమెనూప్రకారంనాణ్యమైనభోజనంఅందించాలనికోరారు. పాఠశాలల్లోపరిశుభ్రతనుకాపాడుతూవిద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలనితెలిపారు. ప్రభుత్వవిద్యనుబలోపేతంచేయాలంటేపాఠశాలల్లోమౌలికసదుపాయాలు,తాగునీరు, పరిశుభ్రమైనమరుగుదొడ్లు,నాణ్యమైన భోజనం,యూనిఫాంలు,పుస్తకాలు తదితర సౌకర్యాలు తప్పనిసరిగా అందుబాటులోఉండాలనిపేర్కొన్నారు. ప్రభుత్వంవెంటనేస్పందించిపాఠశాలల్లోఉన్నసమస్యలనుపరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈకార్యక్రమంలోసాయికిరణ్,సురేష్, పవన్,తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేట పట్టణం నుండి సైక్లింగ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందించిన వంగ రాజేశ్వర్ రెడ్డి

సైక్లింగ్‌లో జాతీయ స్థాయి (నేషనల్) పోటీలకు ఎంపికైన క్రీడాకారులు మర్యాదపూర్వకంగా వంగ రాజేశ్వర్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వంగ రాజేశ్వర్ రెడ్డి క్రీడాకారులను అభినందిస్తూ, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చి రాష్ట్రానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడల్లో క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధన విజయానికి పునాదులని పేర్కొన్నారు. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# ట్రిలియనీర్ అంటే ఎంత సొమ్ము? ప్రపంచ తొలి ట్రిలియనీర్‌గా ఎలాన్ మస్క్ మారుతారా?




ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మరో చారిత్రాత్మక మైలురాయికి చేరువయ్యారని అంతర్జాతీయ ఆర్థిక వర్గాలు చర్చిస్తున్నాయి. మస్క్‌కు చెందిన అంతరిక్ష సాంకేతిక సంస్థ స్పేస్‌ఎక్స్ భారీ విజయంతో అమెరికా స్టాక్ మార్కెట్లో అడుగుపెట్టబోతున్న నేపథ్యంలో, ఆయన ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా మారే అవకాశాలపై ఆసక్తికర చర్చ మొదలైంది.

స్పేస్‌ఎక్స్ నిర్వహించిన ఐపీఓ (ఖూూ)కు పెట్టుబడిదారుల నుంచి భారీ స్పందన లభించింది. కంపెనీ ఏకంగా 75 బిలియన్ డాలర్లు సమీకరించగా, సంస్థ విలువ 1.77 ట్రిలియన్ డాలర్లకు చేరినట్లు సమాచారం. దీంతో ఎలాన్ మస్క్ వ్యక్తిగత సంపద కూడా భారీగా పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

అసలు ట్రిలియనీర్ అంటే ఏమిటి?

ప్రస్తుతం ప్రపంచంలో బిలియనీర్లు (దీఅశ్రీశ్రీఅశీఖుఅతీవం) వేల సంఖ్యలో ఉన్నప్పటికీ, ట్రిలియనీర్ మాత్రం ఇప్పటివరకు ఎవరూ కాలేదు. ఒక ట్రిలియన్ అంటే:

సంఖ్యల్లో: 1 ఎతీఅశ్రీశ్రీఅశీఅ =1,000,000,000,000,

అంటే: 1 ఎష్ట్రశీబయిఅఎ = 1,000,

1 వీఅశ్రీశ్రీఅశీఅ = 10 లక్షలు,

1 దీఅశ్రీశ్రీఅశీఅ = 100 కోట్లు,

1 ఎతీఅశ్రీశ్రీఅశీఅ = 1 లక్ష కోట్లు (ఖూ ఐశీశ్రీశ్రీఖతీ వతీఎం),భారత కరెన్సీలో ఎంత? ప్రస్తుతం 1 డాలర్, ?85 అనుకుంటే: 1 ట్రిలియన్ డాలర్లు = ?85 లక్షల కోట్లు భారతీయ కరెన్సీలో చెప్పాలంటే, 1 ట్రిలియన్ డాలర్లు అంటే సుమారు రూ. 85 లక్షల కోట్లు. ఈ మొత్తం భారత కేంద్ర ప్రభుత్వ వార్షిక బడ్జెట్ కంటే కూడా ఎక్కువగా ఉంటుంది.

ప్రస్తుతం ఎలాన్ మస్క్ సంపద ఎంత? టెస్లా, స్పేస్‌ఎక్స్, ఎక్స్ (ట్విట్టర్), ఎక్స్ఏఐ, న్యూరాలింక్ వంటి సంస్థల్లో ఉన్న వాటాల కారణంగా ఎలాన్ మస్క్ ప్రపంచంలోనే అత్యంత ధనవంతుల జాబితాలో అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. ఆయన వ్యక్తిగత సంపద సాధారణంగా 350 నుంచి 450 బిలియన్ డాలర్ల మధ్య మారుతూ ఉంటుంది. అయితే ట్రిలియనీర్ కావాలంటే ఆయన సంపద 1 ట్రిలియన్ డాలర్ల మార్క్‌ను దాటాలి. అంటే ప్రస్తుతం ఉన్న స్థాయి నుంచి ఇంకా భారీగా పెరగాల్సి ఉంటుంది.

స్పేస్‌ఎక్స్ ఐపీఓ ఎందుకు ప్రత్యేకం? స్పేస్‌ఎక్స్ ఐపీఓ ప్రపంచ ఆర్థిక మార్కెట్లలో సంచలనంగా మారింది. కంపెనీ విక్రయానికి ఉంచిన షేర్ల కంటే మూడు రెట్లు ఎక్కువ డిమాండ్ నమోదైనట్లు అంతర్జాతీయ మీడియా సంస్థలు వెల్లడించాయి. సంస్థాగత పెట్టుబడిదారులతో పాటు చిన్న పెట్టుబడిదారులు కూడా పెద్ద ఎత్తున ఆసక్తి చూపడం విశేషం.

ఈ ఐపీఓ విజయవంతమైతే స్పేస్‌ఎక్స్ ప్రపంచంలోని అత్యంత విలువైన టెక్నాలజీ కంపెనీల సరసన నిలిచే అవకాశం ఉంది. నిపుణులు ఏమంటున్నారు? అయితే అందరూ ఈ విలువను సమర్థించడం లేదు. కొంతమంది ఆర్థిక నిపుణుల అభిప్రాయం ప్రకారం, స్పేస్‌ఎక్స్‌కు మార్కెట్ అధిక విలువ కట్టిందని అంటున్నారు. ప్రముఖ పరిశోధనా సంస్థ మార్నింగ్‌స్టార్ అంచనా ప్రకారం, కంపెనీ షేర్ అసలు విలువ ఐపీఓ ధర కంటే తక్కువగా ఉండవచ్చని పేర్కొంది. అయినప్పటికీ, అంతరిక్ష సాంకేతికత, ఉపగ్రహ సేవలు, కృత్రిమ మేధస్సు రంగాల్లో స్పేస్‌ఎక్స్ వేగంగా విస్తరిస్తుండటంతో పెట్టుబడిదారులు భారీగా ఆకర్షితులవుతున్నారు. ప్రపంచ తొలి ట్రిలియనీర్‌గా మస్క్? ప్రస్తుతం ఎలాన్ మస్క్ ట్రిలియనీర్ కాలేదు. అయితే స్పేస్‌ఎక్స్, టెస్లా, ఎక్స్ఏఐ వంటి సంస్థల విలువలు ఇదే వేగంతో పెరుగుతూ ఉంటే, ప్రపంచంలో తొలి ట్రిలియనీర్‌గా నిలిచే వ్యక్తి ఎలాన్ మస్క్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. అంతరిక్షం నుంచి కృత్రిమ మేధస్సు వరకు విస్తరించిన మస్క్ వ్యాపార సామ్రాజ్యం ఇప్పుడు మరో చారిత్రాత్మక రికార్డు దిశగా పయనిస్తుండ టంతో ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారుల దృష్టి స్పేస్‌ఎక్స్‌పైనే నిలిచింది.

# భూ సర్వే ప్రక్రియలో రెవెన్యూ గ్రామాల హద్దుల నిర్ధారణతో సమస్యల పరిష్కారం.. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

ప్రభుత్వ ఆదేశం ప్రకారం జిల్లాలో భూ సర్వే ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని, రెవెన్యూ గ్రామాల హద్దుల నిర్ధారణతో సమస్యల పరిష్కారానికి వెసులుబాటు కలుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని చెన్నూరు మండలం కిష్టంపేట గ్రామంలో ఏర్పాటు చేసిన సమగ్ర భూ సర్వే అవగాహన సదస్సుకు మండల తహశీల్దార్ మల్లికార్జున్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన భూ సంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులను చూసి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో రికార్డులు, మోకా, పట్టాదారుల వివరాలు ఇతర అంశాలను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మొదటగా గ్రామంలోని భూములకు సంబంధించి హద్దులు నిర్ధారించడం జరుగుతుందని, తద్వారా గ్రామానికి సంబంధించిన భూమి స్పష్టత వస్తుందని, ప్రభుత్వ భూములు సైతం నిర్ధారణ అవుతాయని తెలిపారు. పట్టా కలిగి ఉండి మోకాపై లేకపోవడం, మోకాపై ఉండి పట్టా కలిగి ఉండకపోవడం అంశాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రభుత్వం భూములను ఆక్రమించినట్లయితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. భూ సర్వే సమగ్రంగా నిర్వహించి మ్యాపింగ్ చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో భూ సమస్యలు తలెత్తినట్లయితే న్యాయపరమైన చర్యలకు సులభతరమవుతుందని, మ్యాపింగ్



ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ చర్యలలో భాగంగా నిబంధనల ప్రకారం సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని, న్యాయపరంగా రావలసిన భూమి అందుతుందని తెలిపారు. భూములలో కబ్జాదారుల జాబితా తయారు చేయడం జరుగుతుందని, పట్టా భూముల సర్వే అనంతరం రికార్డులను సరి చూసి సర్వే నెంబర్ల ప్రకారం హద్దుల నిర్ధారణ జరుగుతుందని, పట్టాలో ఒక సర్వే నెంబరు, మోకాలో ఒక సర్వే నెంబరు అంశాలపై మ్యాపింగ్ ప్రకారం పకడ్బందీగా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మ్యాపింగ్ తయారు తర్వాత మార్పులు కష్టతరమని, భవిష్యత్తులో వివాదాలు తలెత్తకుండా ప్రస్తుతం మోకాలో వినియోగిస్తున్న రోడ్డు (దారిని) సైతం మ్యాపింగ్ లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. సర్వేయర్లు, ప్రజల సహకారంతో సమస్యల పరిష్కారం వేగవంతం అవుతుందని తెలిపారు. మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. వంటశాల, తరగతి గదులను పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని, నాణ్యమైన విద్య అందించే దిశగా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. అనంతరం కోటపల్లి మండల కేంద్రంలో కొనసాగుతున్న అమృత్ 2.0 పథకం పనులను మండల తహశీల్దార్ రాఘవేంద్ర, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేశ్వర్ రెడ్డి లతో కలిసి సందర్శించి పనులు త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో కొనసాగుతున్న అదనపు గదులు, భోజనశాల పనులను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న మెనూ, విద్య బోధన తీరును పరిశీలించారు. మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి రెవెన్యూ సదస్సులలో అందిన దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, రెవెన్యూ రికార్డులతో సరి చూసి దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. వివిధ ధ్రువపత్రాల కొరకు కార్యాలయానికి వచ్చిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిని విస్మరించిన బిఆర్ఎస్

బిఆర్ఎస్ గత పదేళ్ల పాలనలో సింగరేణి నిధులను ఇతర ప్రాంతాలకు తరలించి, సింగరేణి, సింగరేణి ప్రాంత అభివృద్ధిని విస్మరించి, నేడు సింగరేణి పరిరక్షణ పేరుతో సింగరేణి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని, సింగరేణి గురించి మాట్లాడే నైతిక హక్కు బిఆర్ఎస్ నేతలకు లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా చైర్మన్ పైడిమల్ల నర్సింగ్ విమర్శించారు. శుక్రవారం పట్టణ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సింగరేణి పరిరక్షణ పేరుతో బిఆర్ఎస్ నాయకులు హరీష్ రావు, బాల్క సుమన్ లు కార్మికులను, సింగరేణి ప్రాంత ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. సింగరేణిని, కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని, సింగరేణిని నాశనం చేసిందనె వాక్యాలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాకముందు సింగరేణిలో ఉన్న కార్మికుల సంఖ్య ఎంత, వారి పదేళ్ల పాలన అనంతరం సింగరేణిలో ఉన్న కార్మికుల సంఖ్య



ఎంత అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాకముందు ఓసీపిలను అడ్డుకుంటామని ప్రగల్భాలు పలికి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను విస్మరించి ఓసిపి లు ఏర్పాటు చేసి ఈ ప్రాంతాన్ని బొందలగడ్డగా మార్చారని విమర్శించారు. సింగరేణిని ఏటీఎం లాగా వాడుకుంటూ, సింగరేణిని దోపిడీ చేసింది బిఆర్ఎస్ పార్టీ అని ఆరోపించారు. సింగరేణి డిఎంఎఫ్టీ, సిఎస్ఆర్ నిధులను ఇతర ప్రాంతాలకు మళ్లించి, ఇక్కడి ప్రాంత అభివృద్ధిని విస్మరించారన్నారు. సింగరేణి ప్రాంతంలోని బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు అధికారంలో ఉన్న కాలంలో ఇక్కడి ప్రజల ధనాన్ని లూటీ చేసి, ప్రశ్నించిన వారిపై దాడులు చేయడంతో పాటు అనేక అరాచకాలకు పాల్పడ్డారని అన్నారు. రాష్ట్ర మంత్రి, స్థానిక ఎమ్మెల్యే వివేక్ చెన్నూరులో ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పార్లమెంట్ వేదికగా సింగరేణి రిటైర్మెంట్ కార్మికులకు పెన్షన్ పెంపు కొరకు నిరంతరం కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. ఎంపి గా ఉన్న సమయంలో బాల్క సుమన్ ఒక్కసారి సైతం సింగరేణి ప్రాంత సమస్యలపై పార్లమెంట్ లో గళమెత్తలేదని విమర్శించారు. బిఆర్ఎస్ శ్రేణులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ, ఈ ప్రాంతంలో విధ్వంసాలకు ప్రేరేపించడంతో బాల్క సుమన్ జైలు పాలు అయ్యాడని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ వ్యక్తిగత కక్షలకు పాల్పడదని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ హయాంలో సింగరేణి దోచుకోవడంతోపాటు బిఆర్ఎస్ నాయకులు ఇష్టానుసారంగా సింగరేణి ఆస్తులను కబ్జా చేశారని విమర్శించారు. సింగరేణి కార్మికులకు ఇచ్చిన అనేక హామీలను బిఆర్ఎస్ పార్టీ విమర్శించడంతో గత సింగరేణి ఎన్నికల్లో బిఆర్ఎస్ అనుబంధ టీబీజేకేఎస్ పోటీ చేయలేదని, వారి నేతలు విజిలెన్స్ కేసుల నుండి తప్పించుకునేందుకు ఏఐటీయూసీతో జట్టు కట్టారని విమర్శించారు. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో సింగరేణి, సింగరేణి కార్మికుల సమస్యలు పట్టించుకున్న పాపాన పోలేదని ధ్వజమెత్తారు. కార్మికుల సంక్షేమం, సింగరేణి అభివృద్ధి, నూతన గనుల కొరకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పాటు పడుతుందని తెలిపారు. కార్మికుల్లో కాంగ్రెస్ పార్టీకి లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే సింగరేణి పరిరక్షణ పేరుతో ఇక్కడి ప్రజలను, కార్మికులను బిఆర్ఎస్ నేతలు తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. బిఆర్ఎస్ పార్టీ సింగరేణి అభివృద్ధికి కొరకు చేసిన కృషిని బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాది లాగా సింగరేణి ఆస్తులను ధ్వంసం చేయాలని బాల్క సుమన్ పిలుపునివ్వడం జరిగిందని, అందుకొరకే ఆయన జైలు జీవితం గడపారని గుర్తు చేశారు.

PRGI NO: TGTEL/25/A5514
అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక

# సినిమా
CINEMA




## 'లెనిన్' ట్రైలర్‌పై సినీ తారల ప్రశంసలు..

అక్కినేని యువ హీరో అఖిల్ అక్కినేని నటిస్తున్న తాజా చిత్రం లెనిన్ విడుదలకు సిద్ధమవుతోంది. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం జూలై 10న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. చాలా కాలంగా భారీ విజయం కోసం ఎదురుచూస్తున్న అఖిల్‌కు ఈ సినిమా కీలకంగా మారింది. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ట్రైలర్ చూసిన తర్వాత సూపర్ స్టార్ మహేష్ బాబు సోషల్ మీడియా వేదికగా చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు ట్రైలర్ చాలా ఎంజాయ్ చేశాను. అఖిల్ తన పాత్రలో హృదయాన్ని, ఆవేశాన్ని అద్భుతంగా చూపించాడు. ప్రతి ఫ్రేమ్‌లో అతని నటన ఆకట్టుకుంది. జూలై 10న విడుదల కానున్న ఈ సినిమాతో మొత్తం చిత్ర బృందానికి భారీ విజయం దక్కాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అంటూ ఆయన పోస్టు చేశారు. మహేష్ బాబు చేసిన ఈ పోస్టుకు స్పందించిన అఖిల్.. "అన్నా.. మీ పోస్టు మా ముఖాల్లో పెద్ద చిరునవ్వు తీసుకొచ్చింది. మీకు ఎంత థ్యాంక్స్ చెప్పినా తక్కువే" అంటూ కృతజ్ఞతలు తెలిపాడు. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కూడా ట్రైలర్‌పై ప్రశంసలు కురిపించారు. ట్రైలర్ అద్భుతంగా ఉంది. నా ప్రియమైన సోదరుడు అఖిల్ అదరగొట్టాడు అంటూ ఆయన అభినందించారు.



## నా కెరీర్‌లో చెత్త సినిమా అదే.. కానీ అదే నా జీవితాన్ని మార్చింది..



వివాదాస్పద దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మరోసారి తనదైన శైలిలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన తన సినీ ప్రయాణం, వ్యక్తిత్వం, విజయాలు, వైఫల్యాలతో పాటు జీవితంపై తన ఆలోచనలను పంచుకున్నారు. ముఖ్యంగా తన కెరీర్‌లో అత్యంత చెత్త సినిమాగా ఏ చిత్రాన్ని భావిస్తారన్న ప్రశ్నకు ఆయన ఇచ్చిన సమాధానం సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. తన కెరీర్‌లో అత్యంత నిరాశపరిచిన చిత్రంగా అంతంను పేర్కొన్న వర్మ, ప్రముఖ రచయిత జేమ్స్ హాడ్లీ ఛేజ్ నవల ఆధారంగా తెరకెక్కించిన ఆ చిత్రాన్ని తాను అనుకున్న స్థాయిలో మలచలేకపోయానని చెప్పారు. అయితే, అదే సినిమా తన బాలీవుడ్ ప్రయాణానికి బలమైన పునాది వేసిందని వెల్లడించారు. 'అంతం' ద్వారానే నటి ఊర్మిళ మటోండ్కర్ పరిచయం అయ్యారని, ఆ తర్వాత ఆమెతో కలిసి రూపొందించిన రంగీలా తన కెరీర్‌లో పెద్ద మలుపు తీసుకొచ్చిందని చెప్పారు.

## 'బిగ్‌బాస్‌కు నేను సెట్ కాను'.. షో ఎందుకు తిరస్కరించిందో చెప్పిన నాగదుర్గ

ఫోక్ సాంగ్స్, డ్యాన్స్ ప్రదర్శనలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నాగదుర్గ ఇప్పుడు హీరోయిన్‌గా కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తోంది. ఇడుపు కాయితం చిత్రంతో వెండితెరకు పరిచయం అవుతున్న ఆమె పేరు ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమాను సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాసు వర్క్స్ బ్యానర్లపై నిర్మిస్తుండగా, ప్రియదర్శి హీరోగా నటిస్తున్నారు. ఇందులో నాగదుర్గ 'శ్రీలత' అనే తెలంగాణ యువతి పాత్రలో కనిపించనుంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు సినిమాపై ఆసక్తిని పెంచగా, 'ఇడుపు కాయితం' టైటిల్ కూడా సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది.

## 'ఏజెంట్' తర్వాత నా జీవితమే మారిపోయింది..



అక్కినేని యువ హీరో అఖిల్ అక్కినేని నటిస్తున్న తాజా చిత్రం లెనిన్ జూలై 10న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో చిత్రబృందం ప్రమోషన్లను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా అఖిల్ వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటూ సినిమా విశేషాలతో పాటు గత మూడు సంవత్సరాల తన ప్రయాణం గురించి ఆసక్తికర విషయాలు పంచుకుంటున్నారు. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన అఖిల్, ఏజెంట్ విడుదలైన మూడు నెలల తర్వాత జరిగిన ప్రమాదం గురించి వెల్లడించారు. పడ్డాయని చెప్పారు. ఈ ప్రమాదం తన వ్యక్తిగత జీవితంతో పాటు కెరీర్‌పైనా తీవ్ర ప్రభావం చూపిందని పేర్కొన్నారు.





## పురాతన రహస్యాల ఛేదనలో..



నటుడు గణేశ్ కథానాయకుడిగా రూపొందుతున్న ఫిక్షనల్ మూవీ 'పినాక'. ధనంజయ దర్శకుడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్న ఈచిత్రం అక్టోబర్ 2న గ్రాండ్‌గా విడుదల కానున్నది. ఆదివారం హీరో గణేశ్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా సినిమాలోని ఆయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేసి, శుభాకాంక్షలు అందించారు. పురాతన రహస్యాన్ని ఛేదించడంలో నిమగ్నమైన గణేశ్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. పురాణాలు, రహస్యాలతో నిండిన అద్భుత ప్రయాణం ఈ సినిమా అని, అన్ని వర్గాలనూ ఆకట్టుకునేలా సినిమా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: కర్మ్ చావ్లా, సంగీతం: గౌర హరి.

## హృద్యమైన కాగితం పడవలు

వర్ధన్, కృష్ణప్రియ జంటగా నటిస్తున్న ప్రేమకథాచిత్రం 'కాగితం పడవలు'. ఎంజీఆర్ తుకారం దర్శకుడు. కీర్తన నరేశ్, టీఆర్ ప్రసాద్‌రెడ్డి వెంకట్రాజుల, గాయిత్రమ్మ అంజనప్ప నిర్మాతలు. ఇప్పటికే ప్రచార చిత్రాలకు మంచి స్పందన వస్తున్నదని మేకర్స్ ఆనందం వెలిబుచ్చారు. తాజాగా ఈ చిత్రం విడుదల తేదీని మేకర్స్ ప్రకటించారు. ఈ నెల 24న ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా సినిమా విడుదల కానున్నది. అందర్నీ అలరించే హృద్యమైన ప్రేమకథాచిత్రమిదని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: రుద్రసాయి, సంగీతం: ఏఐఎస్ నౌఫల్ రాజా, నిర్మాణం: ఎస్ఎల్ఎన్ సినీ క్రియేషన్స్, ప్రణది క్రియేషన్స్, నవ నారాయణ సినీ క్రియేషన్స్.



# హోమ్ మంత్రిగారి మౌనమెందుకో...

**విజయవాడ, జూలై 3, అర్జున్ సమాచారం ప్రతినిధి**

ఏపీ హోం మినిస్టర్ వంగలపూడి అనిత యమా యాక్టివ్‌గా ఉంటారు. పొలిటికల్ ప్రత్యర్థులపై ఓ రేంజ్‌లో విరుచుకుపడుతుంటారు. ప్రతిపక్ష నేత జగన్‌ను ఉద్దేశించి పులివెందుల ఎమ్మెల్యే అని సెటైరికల్‌గా మాట్లాడ్డం ఆమెతోనే మొదలైందని చెప్పుకుంటాయి రాజకీయవర్గాలు. అంతవరకు సరే.. రాజకీయ వ్యవహారాల్లో ఎవరి లెక్కలు వారికి ఉంటాయి. కానీ, మంత్రి హోదాలో ఉండి సంబంధింత శాఖ వ్యవహారాల



గురించి పట్టించుకోకుండా అనిత కేవలం పొలిటికల్ స్టేట్‌మెంట్స్‌కే పరిమితం అవుతున్నారా అన్నది చాలా మందికి వస్తున్న లేటెస్ట్ డౌట్.ఎందుకంటే.. రాష్ట్రాన్ని కుదిపేసిన సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసుపై హోం మినిస్టర్ సక్రమంగా స్పందించలేదన్నది రాజకీయవర్గాల విస్తృతాభిప్రాయం. ఆ వ్యవహారానికి సంబంధించి ఇప్పటివరకు ఒకే ఒక్కసారి స్పందించారామె. అదీ కూడా కేవలం ఐదు సెకన్ల రియాక్షన్. సాధారణంగా పొలిటికల్ స్టేట్‌మెంట్స్ విషయంలో అనర్గళంగా మాట్లాడే అనిత అత్యంత కీలకమైన కేసు విషయంలో కేవలం ఐదు సెకన్లకే ఎందుకు పరిమితం అయ్యారన్నది బిగ్ క్వశ్చన్. రాష్ట్ర హోం మంత్రిగా అంత సీరియస్ సమస్య మీద సరిగా స్పందించకపోవడంపై వివిధ వర్గాల్లో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయట.కస్టోడియల్ డెత్ కేసు విషయంలో ఎందుకొచ్చిన గొడవ అనుకుంటూ మంత్రే మాట్లాడ్డం లేదా? లేక స్పందించవద్దని ఆమెకు ఆదేశాలున్నాయా అన్న చర్చలు సైతం పెరుగుతున్నాయి. ఇదే విషయాన్ని విపక్షాలు సైతం నిలదీస్తున్నాయి. అత్యంత ముఖ్యమైన కేసు విషంలో హోం మంత్రి స్పందన అత్యంత పేలవంగా ఉండటం ఏంటి? హోం మంత్రి నోరు కట్టేస్తోంది ఎవరో తేల్చాలంటూ డిమాండ్ చేస్తున్నారు ప్రతిపక్ష నాయకులు. ఈ కేసుకు సంబంధించి హోం మంత్రి రియాక్షన్‌పై రాజకీయవర్గాలతో పాటు సామాన్యుల్లో సైతం రకరకాల డౌట్స్ పెరుగుతున్నాయట.రాష్ట్రానికి చెందిన మాజీ మంత్రి ఒకరు హోం మినిస్టర్ మేకప్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తే.. అంతా ఖండించారు. అలాంటిది ఒక ప్రాణం విషయంలో ఆ స్థాయి స్పందన లేకపోవడం ఏంటన్న మాటలు వినిపిస్తున్నాయి. పై నుంచి వచ్చిన ఆదేశాలతోనే అనిత అలా వ్యవహరిస్తున్నారా అన్న సందేహాలు చాలామందిలో వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయంలో సంబంధిత మంత్రికంటే ఎక్కువగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ స్పందించారు. అయినాసరే ఆమె నుంచి నో రియాక్షన్ అంటే... దీన్నెలా అర్థం చేసుకోవాలంటూ క్వశ్చన్ మార్క్ ఫేస్ పెడుతున్నారు పరిశీలకులు. ఇదే సమయంలో చాలామంది ఇప్పుడు డిప్యూటీ సీఎం వ్యాఖ్యలను కోట్ చేస్తున్నారట. నేనే హోమ్ మంత్రి అయిఉంటే పరిస్థితి వేరే విధంగా ఉండేదని పవన్ వ్యాఖ్యానించడం..అనిత విషయంలో సరిగ్గా సరిపోతుందా అనే చర్చలు సైతం నడుస్తున్నాయి. పవన్‌కళ్యాణ్ ఏ ఉద్దేశ్యంతో అలాంటి వ్యాఖ్యలు చేశారోగానీ.. వాతావరణం మాత్రం అలాగే కనిపిస్తోందని అభిప్రాయపడుతున్నారు కొందరు.కారణం ఏదైనాసరే.. రాష్ట్రంలో ఇంత పెద్ద ఘటన జరిగితే హోమ్ మంత్రి నోరు మెదపక పోవడం మాత్రం తీవ్ర చర్చనీయాంశం అయింది.

# టీచర్లకు బ్రేక్ ఫాస్ట్...లంచ్

**హైదరాబాద్, జూలై 3, (అర్జున్ సమాచారం. ప్రతినిధి )**

తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీల్లో పనిచేసే ఉపాధ్యాయులు, సిబ్బందికి కూడా బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని నిర్ణయించింది. ఇప్పటివరకు విద్యార్థులకు మాత్రమే ఈ టిఫిన్స్, లంచ్ ఉచితంగా అందిస్తుండగా.. ఇక నుంచి టీచర్లు, లెక్చరర్లకు కూడా అందించనున్నారు. సర్కార్ తీసుకున్న ఈ నిర్ణయానికి తాజాగా మంత్రివర్గం కూడా ఆమోద ముద్ర వేసింది.ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులు.. ఆకలితో అలమటించకుండా ఉండేందుకు గత ప్రభుత్వాలు.. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. అయితే తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని కూడా తీసుకువచ్చింది. అంతేకాకుండా ఇంటర్ విద్యార్థులకు కూడా ఈ బ్రేక్‌ఫాస్ట్, మిడ్ డే మీల్స్ పథకాలను ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేస్తోంది. దీంతో ప్రభుత్వ పాఠశాలలతోపాటు కాలేజీల్లో చదివే విద్యార్థులకు రెండు పూటలా పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా రేవంత్ రెడ్డి సర్కార్ మరో కీలక నిర్ణయానికి తెరతీసింది.ఇక నుంచి విద్యార్థులకు మాత్రమే కాకుండా స్కూళ్లు, జూనియర్ కాలేజీల్లో పిల్లలకు చదువు చెప్పే ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందికి కూడా ఈ మధ్యాహ్న భోజన పథకంతోపాటు బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని కూడా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న తెలంగాణ తొలి ఈ-కేబినెట్ భేటీలో విద్యా రంగానికి సంబంధించి ఈ చారిత్రాత్మక నిర్ణయానికి శ్రీకారం చుట్టారు. ఈ నిర్ణయంతో ఇప్పటినుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు.. జూనియర్ కళాశాలల్లో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఇతర సిబ్బంది అందరికీ ఫ్రీగా ఉదయం అల్పాహారం.. మధ్యాహ్న భోజనం అందించనున్నారు.ఇప్పటివరకు గవర్నమెంట్ స్కూళ్లలో కేవలం విద్యార్థులకు మాత్రమే మధ్యాహ్న భోజన పథకం.. కొన్నిచోట్ల సీఎం అల్పాహార పథకం అమలు అవుతుండగా.. దాన్ని ఉపాధ్యాయులకు కూడా విస్తరించనున్నారు. తెలంగాణ కేబినెట్ తీసుకున్న తాజా నిర్ణయంతో విద్యాసంస్థల్లో టీచర్లు, లెక్చరర్లు మరికొంత ఎక్కువ సమయం గడపడానికి.. విద్యార్థులకు మరింత అందుబాటులో ఉండేందుకు వీలు కలుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంపై రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ సంఘాలు, విద్యా రంగ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# మాజీ డీజీపీలకు సెక్యూరిటీ తగ్గింపు

## బుల్లెట్ ఫ్రూఫ్ వాహనాలు తొలగింపు

**హైదరాబాద్, జూలై 3, (అర్జున్ సమాచారం)ప్రతినిధి.**

భద్రతా ఏర్పాట్ల విషయంలో తెలంగాణ పోలీస్ శాఖ కీలక మార్పులు చేసింది. మాజీ డీజీపీలు, రిటైర్డ్ ఐపీఎస్ అధికారులు, ప్రస్తుతం కీలక బాధ్యతల్లో ఉన్న పలువురు పోలీసు అధికారులకు కేటాయించిన బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలు, ఎస్కార్ట్ వాహనాలను ఉపసంహరించుకుంది. అలాగే పలువురు వీఐపీలు, అధికారులకు ఉన్న గన్‌మెన్ల సంఖ్యను కూడా తగ్గించింది. ఇంటెలిజెన్స్ నివేదికలు, రాష్ట్రంలో మారిన భద్రతా పరిస్థితులు, ప్రభుత్వ వ్యయ నియంత్రణలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.తెలంగాణ పోలీస్ శాఖ సంచలన నిర్ణయం తీసుకుంది. పలువురు మాజీలు, రిటైర్డ్, కీలక ఉన్నతాధికారులకు భద్రత, వాహనాలను తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే సెక్యూరిటీ రివ్యూ చేపట్టిన అధికారులు.. ఈ నిర్ణయానికి ఆమోదం తెలిపారు. మాజీ డీజీపీలు, రిటైర్డ్ ఐపీఎస్‌లు, కీలక పదవుల్లో ఉన్న ఉన్నతాధికారులకు ఇప్పటివరకు కల్పిస్తున్న బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలు, ఎస్కార్ట్ వాహనాలను తొలగిస్తూ.. పోలీస్ శాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. అదే సమయంలో కొంతమంది అధికారులు, మాజీ అధికారులకు సెక్యూరిటీని కూడా తగ్గించింది. ఏకంగా 100 మంది అధికారులకు సెక్యూరిటీ, వాహనాలను తగ్గించినట్లు తెలుస్తోంది.ఈ



నిర్ణయంతో మాజీ డీజీపీలు స్వరజిత్ సేన్, ఏకే ఖాన్, ఏకే మహంతి, దినేష్ రెడ్డి, జితేందర్, మహేందర్ రెడ్డి, అనురాగ్ శర్మతో పాటు పూర్ణచందర్‌రావు, కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి, నవీన్ చంద్, డానియల్, వెంకట్రామిరెడ్డి, స్టీఫెన్ రవీంద్ర, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, డీటీ నాయక్, ఉమేష్ షరీఫ్, రవి గుప్తా వంటి మాజీ ఉన్నతాధికారులకు వాహనాలను తొలగించినట్లు అధికారులు వెల్లడించారు. ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్ కుమార్‌తో పాటు కొంతమంది ప్రస్తుత ఉన్నతాధికారులు, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు కూడా ఈ మార్పులు వర్తించనున్నాయని పేర్కొన్నారు.బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలతో పాటు మాజీ డీజీపీలకు కేటాయించిన ఎస్కార్ట్ వాహనాలను కూడా వెనక్కి తీసుకోవాలని తెలంగాణ పోలీస్ శాఖ నిర్ణయించింది. మరోవైపు.. పలువురు రాజకీయ నాయకులు, మాజీ ఉన్నతాధికారులకు కేటాయించిన గన్‌మెన్ల సంఖ్యను కూడా తగ్గించారు. ఎక్కువ మందికి 1o1 భద్రతా విధానం (ఒక వ్యక్తిగత భద్రతా సిబ్బంది, ఒక డ్రైవర్/సహాయకుడు) మాత్రమే కొనసాగించేలా ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. తెలంగాణలో నక్సలిజం ప్రభావం భారీగా తగ్గిపోవడం.. ఇంటెలిజెన్స్ బ్యూరో ఇచ్చిన తాజా భద్రతా నివేదికలు.. ప్రభుత్వ ఖర్చులు తగ్గించడం వంటి పలు అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వంద మందికి పైగా వీఐపీలకు కల్పిస్తున్న భద్రతను సమీక్షించి.. అవసరమైన వారికి మాత్రమే స్పెషల్ సెక్యూరిటీని కొనసాగించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది.అయితే.. ఈ నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రతిపక్ష నేతలు, మాజీ పోలీస్ ఉన్నతాధికారులను టార్గెట్‌గా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం వారికి భద్రతను తగ్గిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మాజీ ఐపీఎస్ అధికారి, బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు కేటాయించిన బుల్లెట్‌ప్రూఫ్ వాహనాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోగా.. ఈ నిర్ణయాన్ని ఆయన తెలంగాణ హైకోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు.. వారం రోజుల పాటు బుల్లెట్‌ప్రూఫ్ వాహనాన్ని తొలగించవద్దని రాష్ట్ర ప్రభుత్వానికి మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుపై తదుపరి విచారణ కొనసాగుతోంది.

# టాప్ గేర్‌లో ఇండియన్ ఎకానమీ

**ముంబై జూలై 3, (అర్జున్ సమాచారం. ప్రతినిధి )**

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక అనిశ్చితులు, అంతర్జాతీయ సవాళ్ల మధ్య భారత ఆర్థికవ్యవస్థ సరికొత్త రికార్డులతో దూసుకుపోతుంది. దేశీయ డిమాండ్, పటిష్టమైన పెట్టుబడుల అండతో భారత్ మరోసారి ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా తన స్థానాన్ని నిలబెట్టుకుంది. ప్రభుత్వ తాజా ఆర్థిక గణాంకాల ప్రకారం.. జీడీపీ, జీఎస్టీ వసూళ్లు, మాన్యుఫ్యాక్చరింగ్, ఆటోమొబైల్ రంగాలు జూన్ 2026 నాటికి బంపర్ గ్రోత్‌ను నమోదు చేశాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ ఏకంగా 7.7 శాతం వృద్ధిని నమోదు చేసింది. ముఖ్యంగా చివరి త్రైమాసికంలో వృద్ధి రేటు గతేడాది 7శాతం నుండి 7.8 శాతానికి చేరింది. మాన్యుఫ్యాక్చరింగ్, సేవా రంగాలు, వినియోగం, పెట్టుబడులు ఈ భారీ వృద్ధికి ప్రధాన కారణాలుగా నిలిచాయి.

రికార్డు స్థాయిలో జీఎస్టీ, పన్ను వసూళ్లు

దేశంలో ఆర్థిక కార్యకలాపాలు ఎంత జోరుగా సాగుతున్నాయో చెప్పడానికి పన్ను వసూళ్లే నిదర్శనం.

జీఎస్టీ కలెక్షన్స్: జూన్ 2026 లో స్థూల జీఎస్టీ వసూళ్లు గతేడాదితో పోలిస్తే 13.9శాతం పెరిగి ఏకంగా రూ.1.95 లక్షల కోట్లకు చేరాయి.

డైరెక్ట్ టాక్స్: జూన్ 17 వరకు నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.14.64శాతం వృద్ధితో రూ.5.21 లక్షల కోట్లకు చేరాయి.

తయారీ, సేవా రంగాల్లో జోరు

మాన్యుఫ్యాక్చరింగ్ జూన్ 2026 లో హెచ్ఎస్బీసి ఇండియా



మాన్యుఫ్యాక్చరింగ్ పిఎమ్ఐ 54.2 గా నమోదైంది. వరుసగా 37వ నెలలోనూ ఇది 50 పాయింట్ల కంటే పైనే కొనసాగుతూ స్థిరమైన వృద్ధిని చాటుతోంది.

సర్వీసెస్ సేవా రంగం ఇండెక్స్ మే నెలలో 59.8కి చేరింది. కొత్త క్లయింట్లు, ఎగుమతుల డిమాండ్ పెరగడంతో నవంబర్ 2025 తర్వాత ఇదే అత్యుత్తమ వృద్ధి.

5 నెలల గరిష్టానికి పారిశ్రామిక ఉత్పత్తి

భారత పారిశ్రామిక ఉత్పత్తి సూచీ మే నెలలో 5.1 శాతానికి చేరి ఐదు నెలల గరిష్టాన్ని తాకింది.

విద్యుత్, గ్యాస్ సరఫరా రంగం 9.9శాతం వృద్ధి చెందింది. మోటారు వాహనాల రంగం 14.5శాతం, ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్ రంగం 20.8శాతం చొప్పున భారీ గ్రోత్ సాధించాయి.

**ఇన్ఫ్రాస్ట్రక్చర్‌పై కేంద్రం భారీ వ్యయం**

దేశంలో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఏప్రిల్-మే 2026 లోనే రూ.2.51 లక్షల కోట్ల క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ చేసింది. రైల్వే భద్రత, సిగ్నలింగ్, కొత్త లైన్ల కోసం ఏప్రిల్-మే నెలల్లోనే ఏకంగా రూ.84,000 కోట్లకు పైగా ఖర్చు చేయడం గమనార్హం.

**జోరుగా ఆటోమొబైల్స్, పెరిగిన గ్రామీణ డిమాండ్**

ఆటోమొబైల్స్: ఏప్రిల్ నెలలో 26.11 లక్షల యూనిట్ల సేల్స్‌తో దేశీయ ఆటోమొబైల్ రంగ చరిత్రలోనే బెస్ట్ ఏప్రిల్ నమోదైంది. మే నెలలో కూడా 25.31 లక్షల యూనిట్ల విక్రయాలు జరిగాయి. ఎస్‌యూవీలు, ఈవీలు, టూ వీలర్లకు భారీ డిమాండ్ ఉంది. మే నెలలో గ్రామీణ ప్రాంతాల్లో వాహనాల విక్రయాలు 7.8% పెరిగాయి, ఇది రూరల్ ఎకానమీ బలంగా ఉందనడానికి స్పష్టమైన సంకేతం. దేశంలో వస్తు రవాణాకు అద్దం పట్టే ఈ-వే బిల్స్ జనరేషన్ మే నెలలో 10.9శాతం పెరగ్గా, విద్యుత్ డిమాండ్ 11.2శాతం పెరిగింది. పోర్ట్ ట్రాఫిక్ కూడా 6.6శాతం వృద్ధి సాధించింది.

# ఒకటో తేదీకే పెన్షన్ జమ చేయాలి.. లేకుంటే ఉద్యమమే

## బొగ్గు గని భవిష్యనిధి కార్యాలయం ఎదుట ధర్నాకు సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం హెచ్చరిక

**అర్జున్ సమాచారంజూలై 03 మంచిర్యాల ప్రతినిధి:**

సింగరేణి వ్యాప్తంగా పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు బొగ్గు గని పెన్షన్ ప్రతి నెల ఒకటో తేదీనే ఆయా బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా చర్యలు చేపట్టాలని సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. బొగ్గు గని భవిష్యనిధి



కార్యాలయ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వేలాది మంది పెన్షన్ దారులు ప్రతి నెలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య తెలిపారు.శుక్రవారం ఉదయం పదిన్నర గంటలు దాటినా భారతీయ స్టేట్ బ్యాంకులో ఖాతాలు కలిగిన అనేక మంది విశ్రాంత ఉద్యోగుల ఖాతాల్లో పెన్షన్ జమ కాకపోవడంతో తీవ్ర ఆందోళన వ్యక్తమైందన్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు.ప్రతి నెల ఒకటో తేదీనే పెన్షన్ మొత్తం లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యేలా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో గోదావరిఖని బొగ్గు గని భవిష్యనిధి కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన, ధర్నా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలోని భారతీయ స్టేట్ బ్యాంకు ప్రధాన శాఖ ఎదుట సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భూపతి లక్ష్మణ్, రామ్ చందర్, ఇక్బాల్ హుస్సేన్, రామ్ బ్రహ్మం, రాజేశం, పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. బొగ్గు గని భవిష్యనిధి కార్యాలయ అధికారుల నిర్లక్ష్యాన్ని ఖండిస్తూ నినాదాలు చేశారు.

Printed, Published and Owned by LINGAM RAJAIAH, and Printed at Vijaya Lakshmi Printing Press , H.No.12-180, Gouthaminagar,Mancheria, Mancherial Telangana-504208, and Published at H.No.12-180, Gouthami-nagar,Mancheria,Mancherial Telangana-504208. Editor: LINGAM RAJAIAH. PRGI. No. TGTEL/25/A5314, lingamrajaiahmncl@gmail.com,8121319896.